
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com
Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :87 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 07 ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## రాష్ట్ర ప్రజలకు తీపికబురు



ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్త రేషన్ కార్డుల పంపిణీ
ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగారెడ్డి లో ప్రారంభం
అదే రోజున 119 నియోజకవర్గాలలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ
పేద కుటుంబాల ఆహార భద్రతకు తెలంగాణ ప్రభుత్వ చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం
మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 6:**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్తగా మంజూరైన లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ (గ్రాణా) రేషన్ కార్డులను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల, ఆహార ౘ పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేశారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేసిన ఒక ప్రకటనలో రేషన్ కార్డుల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోందని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో - మిగతా3లో

## కొలిక్కి ఫోన్ ట్యాపింగ్ కేసు



**హైదరాబాద్, ఆగస్టు 6:**తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం అత్యంత కీలకమైన చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో వేగంగా విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ఆగస్టు 15 నాటికి నాంపల్లి కోర్టులో భారీ అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు వేగంగా సన్నాహాలు చేస్తోంది. దాదాపు 600 మందికి పైగా బాధితులు, సాక్షుల వాంగ్మూలాలు , ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితుల కన్ఫెషన్ స్టేట్‌మెంట్స్ ఆధారంగా పక్కా సాంకేతిక ఆధారాలతో ఈ అదనపు అభియోగపత్రాన్ని సీనియర్ అధికారులు రూపొందించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.ఈ ఛార్జ్‌షీట్ - మిగతా3లో



## విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు..

**లక్నో, ఆగస్టు 6:**ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులతో నిర్వహించనున్న 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరగాల్సిన సభకు ఇచ్చిన అనుమతిని చివరి నిమిషంలో రద్దు చేయడంతో కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.కేపీ గ్రౌండ్ నిర్వహణ బాధ్యతలు చూసే కాయస్థ పాఠశాల ట్రస్ట్.. భారీ వర్షాలు, భద్రతా పరిస్థితులు, కోర్టు ఆదేశాల కారణంగానే అనుమతి వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది.అయితే ఇది బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో తీసుకున్న - మిగతా3లో

## నైనీ గని నుంచి ఎస్‌టీపీపీకి చేరిన తొలి బొగ్గు రైలు..

### డిప్యూటీ సీఎం హర్షం

**మంచిర్యాల, ఆగస్టు 6:** మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఎస్టీపీపీ) కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు రావడం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 59 బాక్స్



వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ-10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి.

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆ పాఠశాలకు నూతన సొబగులు



**ఖమ్మం జిల్లా, ఆగస్టు 6 :** ఖమ్మం జిల్లాలోని గోపాలపురం పాఠశాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ) అండగా నిలబడ్డారు. ఆ పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఖమ్మం కలెక్టర్ దివాకర్ పాఠశాలను సందర్శించారు.ఉపాధ్యాయిని ఇందిరతో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడారు. శిథిల భవనాల స్థానంలో కొత్త తరగతి గదులు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయినిని అధికారులు అభినందించారు. సీఎం ఆదేశాలతో వెంటనే నిధుల విడుదల చేశారు. ఈ నిధులతో గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పథంలో కొనసాగనుంది.



## జొన్న రైతులకు రూ.994 కోట్లు జమ

**హైదరాబాద్, ఆగస్టు 6 :** జొన్న రైతులకు రూ.994 కోట్లు జమ చేశామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. 1.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసినట్లు స్పష్టం చేశారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణ జొన్న కొనుగోలు విధానాన్ని తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎంఎస్పీతో రికార్డు స్థాయిలో జొన్నల కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందిస్తున్నామని తెలిపారు. **FFS** అమలు మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నామనిమంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. ఎరువుల విక్రయాల్లో డిజిటల్ పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఆధార్‌తో ఎరువుల కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రియల్‌టైమ్ స్టాక్ సమాచారం తమకు ఉందని వెల్లడించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు ఖీఖీ వ్యవస్థ చెక్ చెబుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ విస్తరణపై అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. అన్నదాతలకు వెంటనే ఆయిల్ పామ్ మొక్కలు అందించాలని సూచించారు. డ్రిప్ ఏర్పాటు ఆలస్యం కాకూడదని చెప్పారు. గ్రామాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. యువ ఆవిష్కర్తలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందజేస్తోందని పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ హ్యాకథాన్-2026 విజేతకు మంత్రి సన్మానించారు. జాతీయ ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి వగ్గు శ్రీరామ్‌కు అభినందనలు తెలిపారు. నేతన్నల కోసం వినూత్న 'ఎర్గోనామిక్ బ్యాక్ సపోర్ట్' మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు .

## ప్రొఫెసర్ కు ఘనంగా నివాళి....

**హైదరాబాద్, ఆగస్టు 6:**తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రత్యేక తెలంగాణ కోసం జయశంకర్ జీవితాంతం నిరంతరం శ్రమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరువరని చెప్పారు. ప్రాంతానికి



జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో దేశం ముందు ఉంచి, ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపారని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, ఉద్యమానికి అందించిన స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా జయశంకర్‌కు ఘన నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆయన జీవిత లక్ష్యమని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు - మిగతా3లో

## కేబినెట్ విస్తరణపై కర్ణాటక ఎఫెక్ట్

**హైదరాబాద్, ఆగస్టు 6:**పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి



దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో - మిగతా3లో

## నిలచిపోనున్న పోలవరం-బనకచర్ల పనులు

**హైదరాబాద్, ఆగస్టు 6:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది.ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

# సంపాదకీయం

## గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది.సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది.ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు.ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు.సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు.అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి.చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది.చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది.'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది.ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీలను ప్రవేశపెట్టింది.అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది.ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హోర్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి.సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది.ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# మయన్మార్ తో భారత్ స్మూత్ డీల్


**న్యూఢిల్లీ, ఆగస్టు 6:**మయన్మార్ సరిహద్దుల్లో దశాబ్దాలుగా గుర్తించని వివాదాస్పద ప్రాంతాల పరిష్కారం కోసం భారత్ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "సరిహద్దులో ఇంకా పరిష్కరించని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి... ఆయా అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి" అని తెలిపారు. మణిపూర్ సరిహద్దుల వెంబడి మయన్మార్‌తో భూ మార్పిడికి భారత్ సిద్ధమవుతోందన్న నివేదికలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి చర్చలు జరుగుతున్నాయనే ఈ నివేదికలను ఆయన పరోక్షంగా అంగీకరించారు.దీనిపై అమెరికాకు చెందిన 'ది డిప్లొమాట్' పత్రిక కొద్ది వారాల కిందట కథనం ప్రచురించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మణిపూర్-మాయన్మార్ సరిహద్దులోని పిల్లర్ 65 నుంచి 68 మధ్య ఉన్న సుమారు 2.8 కిలోమీటర్ల పరిధిలోని 1.4 చదరపు మైళ్ల భూభాగాన్ని మార్పిడి చేసుకోవడం ద్వారా సరిహద్దు గుర్తించే ప్రక్రియను పూర్తి చేయాలని భారత ప్రభుత్వం ఒక ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు అధికారిక పత్రాలను ఉటంకిస్తూ జులై 17న సదరు పత్రిక నివేదించింది. భూ మార్పిడి కోసం ప్రతిపాదించిన ప్రాంతం మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో, మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో ఉన్న కబావ్ లోయకు ఆనుకొని ఉంది. మే 26, 2026 నాటి అధికారిక పత్రం ప్రకారం, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియ మూడు నెలల్లో అంటే సుమారుగా ఆగస్టు నాటికి పూర్తి కావాల్సి ఉంది.భారత్, మయన్మార్‌లు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం గుండా మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రాల్లోకి ప్రవేశించే 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో మెజార్టీ ప్రాంతం



కొండలు, అడవులతో నిండి ఉండి చొరబాట్లకు అనుకూలంగా ఉంటుంది. ఇరువైపులా చారిత్రాత్మకంగా ఒకే వర్గానికి చెందిన గిరిజన జాతులు నివాసం ఉంటున్నారు. కేంద్ర హోం శాఖ ప్రకారం.. పిల్లర్ల ద్వారా సుమారు 1,472 కిలోమీటర్ల సరిహద్దును నిర్ధారించారు. అయితే, ప్రధానంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని లోహిత్ సెక్టార్, మణిపూర్‌లోని కబావ్ లోయలో దాదాపు 171 కిలోమీటర్ల సరిహద్దు ఇంకా పరిష్కారం కాలేదు.'ది డిప్లొమాట్' ప్రకారం.. భారత్-మయన్మార్ సరిహద్దులో ఇంకా అపరిష్కృతంగా ఉన్న ప్రాంతంలో గుర్తింపు నిర్ధారణను వేగవంతం చేయడమే భూభాగ మార్పిడి వెనుక ఉద్దేశం. దీనివల్ల సరిహద్దు పొడవునా కంచె నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోతాయి. తత్ఫలితంగా అక్రమ వలసలు, తిరుగుబాటుదారుల కదలికలు, ఇతర సరిహద్దు నేరాలను అరికట్టడానికి వీలు కలుగుతుంది.మయన్మార్ వెంబడి 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు కంచె ప్రణాళికను 2024లో భారత్ ప్రకటించింది. అదే సమయంలో 2018 నుంచి అమల్లో ఉన్న భారత్-మయన్మార్ సరిహద్దు స్వేచ్ఛా రాకపోకల విధానాన్ని కూడా రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. సరిహద్దు సమీపంలో నివసించే గిరిజన వర్గాలు, బోర్డర్ పాస్ ఉపయోగించి వీసా లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి అనుమతి ఉండేది.ప్రస్తుత భారత్-మయన్మార్ సరిహద్దును 1967 ద్వైపాక్షిక ఒప్పందం కింద నిర్వచించారు. కానీ దానిలోని కొన్ని భాగాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అపరిష్కృత ప్రాంతాలను ద్వైపాక్షిక సరిహద్దు యంత్రాంగం ద్వారా నిర్ధారిస్తామని, ఇందులో భాగంగా తొమ్మిది పిల్లర్లు గుర్తించి, ఏర్పాటు చేస్తామని 2018లో పార్లమెంట్‌కు కేంద్రం తెలిపింది.మణిపూర్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాల్లోని 64-68 పిల్లర్ల మధ్య ఉన్న మోల్చామ్ సెక్టార్, 75- 79 పిల్లర్ల మధ్య ఉన్న మోరే సెక్టార్, 88-95 మధ్య ఉన్న చోరో ఖునౌ సెక్టార్ కీలకమైనవి. మయన్మార్‌తో విస్తృతమైన సరిహద్దు వివాదం ఏదీ లేదని, కేవలం తొమ్మిది పిల్లర్ల మధ్య ప్రాంతాలపై మాత్రమే ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా పరిష్కరిస్తున్నామని భారత్ తరుచూ చెబుతోంది.అయితే, పొరుగు దేశాల మధ్య భూభాగ మార్పిడి అసాధారమైంది ఏమీ కాదు. 2015లో భారత్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన భూ సరిహద్దు ఒప్పందం ద్వారా న్యూఢిల్లీ తన భూభాగంలోని 111 ఎన్‌క్లేవ్‌లను ఢాకాకు బదిలీ చేసి, బదులుగా 51 బంగ్లాదేశ్ ఎన్‌క్లేవ్‌లను పొందింది. దీంతో 41 ఏళ్ల నాటి సరిహద్దు వివాదం ముగిసింది. అయితే, ఈ ప్రతిపాదన మణిపూర్‌లో ఇప్పటికే వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. 'ది డిప్లొమాట్' నివేదిక తర్వాత స్థానిక ఇంఫాల్ టైమ్స్ కథనం ప్రకారం.. మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ కేంద్రానికి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ రాష్ట్ర భూభాగంలో చిన్న భాగాన్ని కూడా మయన్మార్‌కు అప్పగించవద్దని, ఒకవేళ అటువంటి ప్రతిపాదనను అమలు చేస్తే, ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని 'కొకొమి' స్పష్టం చేసింది

# ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

**హైదరాబాద్, ఆగస్టు 6:**ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.ఈ క్రమంలోనే విఖ్యాత్ సింగ్ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విఖ్యాత్ సింగ్ చెప్పినట్లు పిల్లల పెంపకం ప్రస్తుతం ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని కొందరు



నెటిజన్లు అంగీకరిస్తూ పోస్టులు పెడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు. అన్నీ డబ్బుతోనే ముడిపెట్టకూడదని హితవు పలుకుతున్నారు. పిల్లలు ఇచ్చే ఆనందం, ప్రేమ, కుటుంబానికి వచ్చే సంతోషాన్ని ఎంత డబ్బుతో అయినా కొలవలేమని పేర్కొంటున్నారు. పిల్లల వల్ల కలిగే ఆనందానికి ఎలాంటి విలువ కట్టలేమని పలువురు నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు

# ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా చిరు

**విజయవాడ, ఆగస్టు 5:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక బ్రాండ్ అంబాసిడర్‌గా మెగాస్టార్ చిరంజీవిని నియమించే దిశగా ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పర్యాటకరంగం అభివృద్ధి , అలాగే ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టుల విశిష్టతను అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేసేందుకు ఆయన ప్రతిభను వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమిక సంప్రదింపులు కూడా పూర్తయ్యాయని చెబుతున్నాయి. గతంలో గుజరాత్ పర్యాటక రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా రంగంలోకి దింపారు. అదే తరహా వ్యూహంతో ఆంధ్రప్రదేశ్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు చిరంజీవి క్రేజ్, గ్లోబల్ పాపులారిటీ ఎంతగానో ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం



యోచిస్తోంది.జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు సాధించడంతో పాటు గతంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం చిరంజీవికి ఉంది. సినిమా రంగానికే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఆయనకున్న విశ్వసనీయత రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన ఇమేజ్ ద్వారా పర్యాటకులు, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడం మరింత సులువవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.చిరంజీవి వ్యాపార రంగానికి కాకుండా నేరుగా రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, టూరిజం ప్రమోషన్ కోసం భాగస్వామి కావడం వల్ల ఇటు సినీ వర్గాల్లోనూ, అటు రాజకీయ రంగాన సరికొత్త ఉత్సాహం నెలకొంది. గత కొన్ని నెలలుగా కూటమి ప్రభుత్వానికి అనుకూల సంకేతాలు ఇస్తూ వస్తున్న చిరంజీవి, ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ అంశంపై తుది రూపుదిద్దుకుంటున్న ప్రక్రియ త్వరలోనే కొలిక్కి రానుందని తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక సమాచారం లేదా సంతకాల ప్రకటన వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకవేళ ఇది ఖరారైతే, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడంలో మెగాస్టార్ పాత్ర అత్యంత కీలకమైనదిగా మారనుంది.

# క్షుద్ర పూజల విషయంలో హరీశ్‌రావు వివరణ ఇవ్వాలి

**మహేశ్ గౌడ్**

**హైదరాబాద్, ఆగస్టు 6 :** మాజీమంత్రి హరీశ్‌రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్షుద్ర పూజల విషయంలో ఆయన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు వెళ్లిన గుడులు క్షుద్ర పూజలకు ఫేమస్ అని చెప్పుకొచ్చారు. ఆయన ఎందుకు అక్కడ పూజలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఈరోజు (గురువారం) గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. తాను ఆయనను కించపరచలేదని స్పష్టం చేశారు. లీగల్ నోటీసులకు తాము భయపడమని అన్నారు.

**హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేయలేదు..**

తాను హరీశ్‌రావు గురించి అబద్ధాలు చెప్పలేదని మహేశ్ గౌడ్ అన్నారు. ఏమైనా ఉంటే న్యాయస్థానంలో కొట్లాడుతామని చెప్పుకొచ్చారు. తాను హరీశ్‌రావుపై తప్పుడు ప్రచారం చేయలేదని తేల్చిచెప్పారు. ఆయన ఎందుకు ఆ గుడులకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రానికి ఎవరు శనో, ఎవరు దరిద్రమో ప్రజలు ఎన్నికల్లో తేల్చారని తెలిపారు. తమకు మూఢనమ్మకాలు లేవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ త్యాగాల గురించి తెలుసుకోవాలని అన్నారు. తమపై విమర్శలు చేయడానికి ప్రతిపక్షాలు అవకాశం ఉందని చెప్పారు.



**నాకు, సీఎంకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదు: మహేశ్ కుమార్ గౌడ్**

తనకు, సీఎం రేవంత్‌రెడ్డికి మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ కుమార్ గౌడ్ తేల్చిచెప్పారు. సీఎం, తాను రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని అన్నారు. నిన్న కూడా సీఎంతో ఫోన్‌లో మాట్లాడానని తెలిపారు. కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదన్నారు. తాము సీఎంని గౌరవిస్తామని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కాదని.. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని తెలిపారు.

**అరవింద్, సంజయ్ చిన్నపిల్లలు..**

తన ఆడియోలు, వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారని.. దమ్ముంటే అవి బయట పెట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. సీఎంకు, తనకు మంచి సఖ్యత ఉందని తెలిపారు. దొంగ చాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్‌లో లేదని స్పష్టం చేశారు. ఏమున్నా తాము ముఖంపైనే మాట్లాడుకుంటామని అన్నారు. బయట జరుగుతున్న విషయాలను కూడా తాము చర్చించుకుంటామని తెలిపారు. కో ఆర్డినేషన్ కమిటీలో కీలక అంశాలపై చర్చ జరిగిందని చెప్పారు. బీజేపీ ఎంపీ అరవింద్ మాటలు నీటి మూటలని ఎద్దేవా చేశారు. తన ముందు అరవింద్, సంజయ్ చిన్నపిల్లలని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

# నాంపల్లి టూ లక్డీ కపూల్
# వై ఆకారంలో బ్రిడ్జి

**హైదరాబాద్, ఆగస్టు 6:**హైదరాబాద్ నడిబొడ్డున ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ నిర్మాణం కానుంది. నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి హెచ్ఎండీఏ డీపీఆర్ రెడీ చేస్తోంది. 1.45 కిలోమీటర్ల పొడవుతో 3 లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌ను అసెంబ్లీ వెనుక నుంచి నిర్మించనుండగా.. లక్డీకాపూల్ వద్ద ఇది మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ వైపులకు విడిపోయేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర కోర్ ఏరియాలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందిహైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కోర్ సిటీలో వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తుది దశకు చేరుకుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ ఫ్లైఓవర్ నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సమీపం నుంచి



పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ వెనుక భాగం మీదుగా రైల్వే ట్రాక్ వెంట లక్డీకాపూల్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 1.45 కిలోమీటర్ల పొడవుతో మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌గా దీన్ని డిజైన్ చేస్తున్నారు. లక్డీకాపూల్ చేరుకున్న తర్వాత ఫ్లైఓవర్ 2 మార్గాలుగా విడిపోయి వై ఆకారాన్ని సంతరించుకోనుంది. ఇందులో ఒక శాఖ దాదాపు 400 మీటర్ల మేర 2 లేన్లతో మాసబ్‌ట్యాంక్ వైపు ఇప్పటికే ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానం కానుండగా.. మరో శాఖ సుమారు 530 మీటర్ల మేర 2 లేన్లతో ఖైరతాబాద్ వైపు రోడ్డుకు కలుస్తుంది.దీంతో నాంపల్లి నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగకుండా నేరుగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నాంపల్లి–లక్డీకాపూల్ మార్గంలో 3 ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండటంతో రోజంతా తీవ్ర ట్రాఫిక్ నెలకొంటోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో ట్రాఫిక్ ఆంక్షల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం ట్రాఫిక్ ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి ట్రాఫిక్ అంచనాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ సంస్థతో సర్వే నిర్వహించగా.. ప్రస్తుతం టోపోగ్రఫీ సర్వే తుది దశలో ఉంది. ఫిల్లర్ల నిర్మాణం, డౌన్ ర్యాంపులు, ప్రభుత్వ భూముల అవసరం, రైల్వే అనుమతులు, అంచనా వ్యయం వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## రాష్ట్ర ప్రజలకు తీపికబురు

- మొదటి పేజీ తరువాయి

ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు..

- మొదటి పేజీ తరువాయి

నిర్ణయమేనని కాంగ్రెస్ ఆరోపించింది. విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ విమర్శించారు. కోటా, డెహ్రాడూన్ తర్వాత ఇప్పుడు ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొందని అన్నారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ వ్యవహారంపై ప్రియాంక గాంధీ కూడా స్పందించారు. "ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా హసన్ కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని, అలాంటి కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని అన్నారు.

# ఎయిర్ పోర్ట్ ఎఫెక్ట్...
# ఆ 30 గ్రామాలకు కనెక్టివిటీ కట్

**అదిలాబాద్, ఆగస్టు 6:**ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భూసేకరణలో అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో 30 గ్రామాలకు కనెక్టివిటీ లేకుండా పోతుంది. దీంతో ప్రత్యామ్నాయంగా కచికంటి మీదుగా కొత్త బైపాస్ నిర్మించనున్నారు. 66 అడుగుల వెడల్పుతో రూపొందనున్న ఈ రహదారి కోసం ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. బంగారుగూడ, కచికంటి మీదుగా జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకునేలా ఈ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. విమానాశ్రయ నిర్మాణం కారణంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణంతో జిల్లాలో రహదారి వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. విమానాశ్రయం కోసం చేపట్టనున్న భూసేకరణలో ప్రస్తుతం వేలాది మంది వినియోగిస్తున్న అనుకుంట ప్రధాన రహదారి కూడా చేరనుండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుపై దృష్టి సారించారు. దాదాపు 30 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్త బైపాస్ రహదారిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణం నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని కచికంటి గ్రామానికి వెళ్లేందుకు శ్రీరాంకాలనీ, కుమ్మరివాడ, విమానాశ్రయ స్థలానికి ఆనుకుని ఉన్న ప్రాంతం, ఇందిరమ్మ కాలనీ మీదుగా ప్రయాణిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంతో ఈ మార్గం మూసివేయబడే అవకాశం ఉండటంతో కచికంటి నుంచి బంగారుగూడ ప్రధాన రహదారిని అనుసంధానించే కొత్త రహదారిని



నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం కచికంటి గ్రామ సమీపంలో కొత్త బైపాస్ నిర్మించి, అక్కడ అవసరమైన భూసేకరణ చేపట్టనున్నారుకొత్త రహదారిని 66 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ద్వారా బంగారుగూడ, కచికంటి మీదుగా ఆదిలాబాద్ పట్టణానికి సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుంది. దీంతో విమానాశ్రయ నిర్మాణం వల్ల కలిగే రవాణా ఇబ్బందులు తగ్గడంతో పాటు భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ రహదారిని రూపొందిస్తున్నారు. ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ, రాముల్‌గూడ, కొత్తగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, బూర్నూర్, అడ్డగుట్ట, శివఘాట్, కుంభఝురి, టాక్లీ గ్రామాలతో పాటు సాత్నాల మండలంలోని రామాయి, జాముల్‌ధరి, న్యూరాంపూర్, సాత్నాల, సుందరగిరి, మాంగూర్ల, కాన్పమేడిగూడ, మేడిగూడ, జామ్ని, మారుగూడ, తోయగూడ, సైద్‌పూర్, సహేజ్, సాంగ్వి, జామ్డ గ్రామాల ప్రజలు నిత్యం ఈ దారినే వినియోగిస్తున్నారు. అదేవిధంగా గాదిగూడ మండలంలోని పరస్వాడ, లోకారి, గాదిగూడ గ్రామాల ప్రజలు కూడా జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.ఇవే కాకుండా ఆదిలాబాద్ అర్బన్ పరిధిలోని బంగారుగూడ, అనుకుంట గ్రామాల ప్రజలకు కూడా ఇదే ప్రధాన రహదారి. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మరికొన్ని గ్రామాల వాసులు కూడా ఆదిలాబాద్‌కు రావడానికి ఈ దారినే ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో రోజూ ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా అనుకుంట ప్రాంతం చుట్టూ ఉన్న వ్యవసాయ భూములను ప్రభుత్వం సేకరించనుంది. దీంతో ఖానాపూర్ సమీపంలోని అనుకుంట మలుపు నుంచి అనుకుంట గ్రామం వరకు ఉన్న ప్రస్తుత రహదారి విమానాశ్రయ పరిధిలోకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాకపోకలు కల్పించేందుకు కొత్త రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంది.

## కేబినెట్ విస్తరణపై కర్ణాటక ఎఫెక్ట్

- మొదటి పేజీ తరువాయి

సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి +వఅ్ఘ ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస?ోతంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత ం కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్త్‌లు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# ప్రొఫెసర్ కు ఘనంగా నివాళి...

- మొదటి పేజీ తరువాయి

జయశంకర్ గురువుతో సమానమని చెప్పారు. తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో విస్తరింపజేసి ఉద్యమానికి బలమైన దిశ చూపిన మహనీయుడిగా అభివర్ణించారు. ఆయన సేవలకు గుర్తింపుగా భూపాలపల్లి జిల్లాకు, వ్యవసాయ కళాశాలకు జయశంకర్ పేరు పెట్టామని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా జయశంకర్‌ను స్మరించారు. తెలంగాణ కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.మరోవైపు కవిత నాయకత్వంలోని తెలంగాణ రక్షణ సేన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తోంది. జయశంకర్‌కు నివాళి అర్పించడంతో పాటు సామాజిక న్యాయం అమలు చేయాలని డిమాండ్ చేయనుంది. సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అని అనలేదని విమర్శించారు.గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు. ఏపీ నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుతో పాటు సమ్మక్క–సారక్క ప్రాజెక్టు 47 టీఎంసీల క్లియరెన్స్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్ఎంబీ అజెండాను మార్పించాలని, లేని పక్షంలో ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చంచల్‌గూడ జైలు నుంచి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు..

### ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డి విచారణ

**సహచర ట్రైనీ ఆఫీసర్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణ రెడ్డి అరెస్ట్**

**రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించిన న్యాయస్థానం**

**చంచల్‌గూడ జైలు నుంచి విచారణ కోసం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు**

**మరో మహిళతో సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెలుగుచూసిన కొత్త ఆధారాలు**

**భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు**



సహచర ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణ రెడ్డిని నేడు హైదరాబాద్ పోలీసుల ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. రెండు రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో చంచల్‌గూడ సెంట్రల్ జైలులో ఉన్న అతడిని అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లావణ్య నాయక్ నేతృత్వంలోని బృందం ఉదయ్ కృష్ణ రెడ్డిని విచారిస్తోంది. రేపు కూడా ఈ విచారణ కొనసాగనుంది. ఈ కస్టడీ విచారణలో కేసుకి సంబంధించి మరిన్ని కీలక ఆధారాలు లభిస్తాయని పోలీసులు భావిస్తున్నారు. జులై 29న అరెస్ట్ అయిన ఉదయ్ కృష్ణ రెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉంటున్నాడు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)లో తనతో పాటు శిక్షణ పొందుతున్న మహిళా అధికారిణి జూలై 18న ఉదయ్ కృష్ణ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. 2025 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఉదయ్ కృష్ణ రెడ్డి, గతంలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. బాధితురాలితో అతనికి 2025 మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ఎన్ఏఏ), ఎస్‌వీపీఎన్‌పీఏలో శిక్షణ సమయంలో వారి మధ్య సంబంధం కొనసాగింది. అయితే, తరచూ గొడవలు, భావోద్వేగ బ్లాక్‌మెయిలింగ్, అనుమానం వంటివి చోటుచేసుకున్నాయి. కొంతకాలం తర్వాత బాధితురాలు అతనితో సంబంధాన్ని తెంచుకుని మరొకరిని వివాహం చేసుకోవడంతో ఉదయ్ కృష్ణ రెడ్డి ఆమెను బెదిరించడం ప్రారంభించాడు. తమ వ్యక్తిగత చాట్‌లను బయటపెడతానని బెదిరించాడు. ఆత్మహత్య చేసుకుంటానని, ఆయుధాలు చూపించి భయపెట్టడం, ఆమె ల్యాప్‌టాప్‌ను పగలగొట్టడం, సోషల్ మీడియాలో నకిలీ ఖాతాలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా, నిందితుడికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో మహిళతో కూడా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు కొత్త ఆధారాలు సేకరించారు. ఈ రెండు రోజుల విచారణలో ఈ కొత్త కోణంపై పోలీసులు మరింత సమాచారం రాబట్టే అవకాశం ఉంది.

# కొలిక్కి ఫోన్ ట్యాపింగ్ కేసు

- మొదటి పేజీ తరువాయి

దాఖలు ద్వారా దేశ చట్టపరమైన చరిత్రలోనే ఒక అరుదైన మైలురాయి నమోదు కాబోతోంది. సాధారణంగా కేసులలో ప్రయోగించే ఐపీసీ సెక్షన్లతో పాటు చట్టవిరుద్ధంగా వ్యక్తుల వ్యక్తిగత స్వేచ్ఛపై నిఘా పెట్టినందుకు గాను ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ కింద అత్యంత కీలకమైన సెక్షన్లను జోడిస్తూ ఈ ఛార్జ్‌షీట్ సిద్ధం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి రక్షణ నిఘా వ్యవస్థలను రాజకీయ స్వలాభం కోసం వాడారనే తీవ్ర ఆరోపణల నేపథ్యంలో టెలిగ్రాఫ్ చట్టం కింద నమోదు చేస్తున్న సెక్షన్లు నిందితులకు చట్టపరంగా పెద్ద చిక్కులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.గత కొద్ది నెలలుగా కొనసాగుతున్న విచారణలో సిట్ అధికారులకు లభించిన సాంకేతిక ఆధారాలు , డిజిటల్ ఫోరెన్సిక్ డేటా ఈ కేసులో ప్రాణవాయువులా మారాయి. రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులతో సహా నగరంలోని పలువురు ప్రముఖుల ఫోన్‌లను నిబంధనలకు విరుద్ధంగా ట్యాప్ చేసినట్లు సేకరించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. నిందితులు డేటాను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, రికవర్ చేసిన హార్డ్ డిస్క్‌లు, కన్ఫెషన్స్ ఆధారంగా బలమైన సాక్ష్యాధారాల నెట్‌వర్క్‌ను సిట్ రూపొందించింది. ఈ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ కేవలం క్రిమినల్ పరిణామాలకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణ రాజకీయ చిత్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన పలువురు ఉన్నతాధికారుల పాత్ర, పొలిటికల్ మాస్టర్‌మైండ్స్ చుట్టూ ఈ విచారణ ఉచ్చు బిగుస్తోంది. ఆగస్టు 15న ఛార్జ్‌షీట్ కోర్టు ముందుకొస్తే, ఇప్పటివరకు తెరవెనుక ఉన్న పలువురు ప్రముఖుల పేర్లు అధికారికంగా వెలుగులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.ఈ అదనపు అభియోగపత్రంలో రాజకీయ నేతల పేర్లు ఉంటాయా అన్నది కీలకంగా మారింది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి వారి పేర్లు గతంలో ప్రచారం లోకి వచ్చాయి. నేరం రుజువైతే ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ కింద వచ్చే శిక్షలు నిందితులకు తీవ్రమైన పరిణామాలను మిగుల్చుతాయి. ఈ కేసులో చట్టపరమైన లొసుగులు లేకుండా పక్కాగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ సీబీఐ తరహాలో సిట్ అధికారులు తమ నివేదికలను అలైన్ చేస్తున్నారు. ఆగస్టు 15 నాటికి నాంపల్లి కోర్టులో సమర్పించబోయే అదనపు ఛార్జ్‌షీట్ తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. 600 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం సెక్షన్లు మరియు రికవర్ చేసిన డిజిటల్ సాక్ష్యాధారాలతో సిట్ సిద్ధం చేసిన ఈ విచారణ నివేదిక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అసలు సూత్రధారులకు ఉచ్చు బిగిస్తుందో లేదో వేచి చూడాలి!

వార్తాతరంగాలు

గురువారం 06 ఆగస్టు 2026

## ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి జయశంకర్ సార్:కవిత




**హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా జీవితం మొత్తం అంకితభావంతో పని చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. జయశంకర్ సార్ జయంతి నేపథ్యంలో అయనకు నివాళు లర్పించారు. కవిత మాట్లాడుతూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను నిరంతరం ప్రశ్నిస్తూ, తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెప్పేవారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో తమను తాము పాలించుకోవాలని పరితపించేవారు. ఆ క్రమంలోనే ఎల్లప్పుడూ ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులని అన్నారు. సాధించిన తెలంగాణలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలని, సామాజిక తెలంగాణ కావాలన్న వారి ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సామాజిక తెలంగాణ సాధనకై తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని అన్నారు.

## గోల్కొండ కోటలో ఘనంగా ఏడవ వారం అమ్మవారి పూజలు

**హైదరాబాద్:**గోల్కొండ కోటలో ఏడవ వారం అమ్మవారి పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు తీర్చుకున్నారు. ఏడవ వారం కావడంతో గత వారాలతో పోలిస్తే భక్తుల రద్దీ కొంత తగ్గినప్పటికీ, ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా, భక్తులు అమ్మవారి దర్శనం కోసం ప్రశాంతంగా బారులు తీరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఏడవ వారం పూజలు విజయవంతంగా ముగియడంతో గోల్కొండ కోటలో భక్తిపారవశ్యం వెల్లివిరిసింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వంతో చర్చిస్తున్నాం

**: ఎమ్మెల్సీ కోదండరాం**



**హైదరాబాద్, ఆగస్టు 06:** పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

## ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి తెలంగాణ సీఎంగా ఉన్నారు.. రేవంత్‌పై హరీశ్ ఫైర్



**సిద్దిపేట, ఆగస్టు 6:** సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. గోదావరిలో 380 TMC\ నీళ్ల కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. GRMB చరిత్రలోనే అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులను రద్దు చేయాలని, రివ్యూ చేయాలని మొదటిసారి వచ్చిందని అన్నారు. గతంలో 18 వరకు GRMB సమావేశాలు జరిగాయని.. అజెండాలో తెలంగాణ ప్రాజెక్టులను పునఃసమీక్షించాలని, ప్రాజెక్టులను రద్దు చేయాలని ఎప్పుడూ రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి GRMB అజెండా మార్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే GRMB మీటింగ్‌ను బహిష్కరించాలని మాజీ మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు 47 ఎవీజల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ూ=ూ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.

## ఆగస్టు 15 నుంచి రేషన్ కార్డులు

**డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు**

**హైదరాబాద్, ఆగస్టు 6:**తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి.

# సిటీ లో 56 శాతమే పూర్తయిన డిజిటైజేషన్

**హైదరాబాద్, ఆగస్టు 6:**తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ SIR రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలానికి దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా దాదాపు 10 శాతం మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుంచి గల్లంతయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందకొడిగా సాగుతుండటం, అసెంబ్లీ నియోజకవర్గాల వ్యాప్తంగా లక్షలాది మందికి బిఎల్వోల ద్వారా నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ డేటా క్రోడీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చివరి క్షణంలో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణలను వేగంగా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణ ఐటీ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా మీ-సేవ కేంద్రాల్లో ఈ సర్టిఫికెట్లను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రాసెస్ పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఓట్ల తొలగింపు నోటీసులు రావడం, డిజిటైజేషన్ నమోదు కేవలం 56 శాతానికే పరిమితం కావడం నగర జనాభాను తీవ్ర అయోమయంలోకి నెట్టిందిఈ తీవ్ర విమర్శలు మరియు క్షేత్రస్థాయి విఫలతలపై కాంగ్రెస్



అధిష్టానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు బూత్ లెవెల్ ఏజెంట్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల ఓట్లను సక్రమంగా నమోదయ్యేలా చూడటంలో పర్యవేక్షణ లోపించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగడం సరికాదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు , నాయకుల పనితీరుపై హైకమాండ్ క్లాస్ తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కొన్ని కీలక నియోజకవర్గాల్లో పక్కా వ్యూహంతో కుట్రలు జరుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బలమున్న సాంప్రదాయ ఓటర్లను, బహుజన, మైనారిటీ , నిరుపేద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు, కొన్ని వర్గాలు కుట్రపూరితంగా పేర్లు తొలగించేలా బిఎల్వోల స్థాయిలోనే తప్పుడు రికార్డులు క్రియేట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ నగరంలో నత్తనడకన సాగుతున్న ప్రాసెస్, క్షేత్రస్థాయి ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తెలంగాణలో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ డెడ్‌లైన్‌ను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక షెడ్యూల్‌ను సవరించింది. కేంద్ర సీఈవో కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వచ్చి డోర్-టు-డోర్ సర్వేను, నియోజకవర్గాల వారీ డేటాను రీ-వెరిఫై చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ ఓటర్ల డేటా సమరం తెలంగాణ రాజకీయంలో కాంగ్రెస్ , ప్రతిపక్షాల మధ్య సరికొత్త వేడిని రగిల్చింది. ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ సర్టిఫికెట్ల సహాయంతో తొలగించిన ఓటర్లు తమ హక్కును తిరిగి పొందుతారా లేదా ముసాయిదా జాబితా నాటికి భారీ స్థాయిలో ఓట్ల కోత తప్పదా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# కాంగ్రెస్ వైపు యువత మారుతోందా..?

**హైదరాబాద్, ఆగస్టు 6:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెన్ జీకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో యువతను ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి జెన్ జీ నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. వారి సమస్యలను తెలంగాణలో పరిష్కరించడమే కాకుండా వారు ఎన్నికల్లో పోటీ చేసే వయసు విషయంలోనూ వయసును తగ్గించాలని ఇటీవల రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. రాష్ట్రంలోనూ యువ ఓటర్లకు గాలం వేయాలన్న ప్లాన్ లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సీనియర్ నేతలను పక్కన పెట్టి యువతకు సీట్లు కేటాయించేలా ఢిల్లీ పర్యటనలో పార్టీ హైకమాండ్ ను ఒప్పించనున్నారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చట్టసభల్లో 'జెన్ జీ' యువతకు ప్రాతినిధ్యం పెరగాలని, పోటీ చేసే వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరడం ద్వారా యువత దృష్టిని ఆకర్షిస్తున్నారు. భవిష్యత్ రాజకీయాల్లో యువత పాత్ర కీలకం అని ఆయన భావిస్తున్నారు. అయితే, విద్యార్థుల నైపుణ్యాలపై ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీశాయి. రేవంత్ రెడ్డి వ్యూహం మరియు ప్రాధాన్యతలు యువత వైపు ఇటీవల కాలంలో కనిపించడం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. చట్టసభల్లో జెన్ జీ యువతకు అవకాశం కల్పించాలని ప్రతిపాదన ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్నారు. ఈ తీర్మానం తెలంగాణ అసెంబ్లీలో చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి బీజేపీని కూడా ఇరుకున పెట్టే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనపడ్తుంది. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 ఏళ్లకు కుదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో యువ నాయకులకు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు తెచ్చేలా ఒత్తిడి తెచ్చే వ్యూహంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయ వ్యూహాలు అమలు చేయడం ఇప్పుడు తెలంగాణలో రాజకీయంగా చర్చ



జరుగుతుంది. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే కాకుండా దేశంలోని యువత మొత్తాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించి వచ్చే ఎన్నికల నాటికి దేశంలోకాంగ్రెస్ పార్టీకి దగ్గర చేయాలన్న స్ట్రాటజీ రేవంత్ చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరుకున పెట్టేందుకు ఇది మరింత ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

# సిటీలో ఈవీ చార్జింగ్ సిస్టమ్

**హైదరాబాద్, ఆగస్టు 6:**భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వాలు సబ్సిడీలతో ప్రోత్సహిస్తున్నప్పటికీ, ప్రధాన రహదారులు, హైవేలపై ఛార్జింగ్ స్టేషన్ల కొరత ఈవీ వినియోగదారులకు పెద్ద సవాలుగా మారింది. దీనికి పరిష్కారంగా తెలంగాణలో దేశంలోనే తొలిసారిగా ఇథనాల్ ఆధారిత ఈవీ ఛార్జింగ్ సిస్టమ్‌ను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సమక్షంలో ప్రారంభించారు. సాంప్రదాయ విద్యుత్ గ్రిడ్‌పై ఆధారపడకుండా పనిచేసే ఈ సాంకేతికత, దేశీయ క్లీన్ ఎనర్జీ రంగానికి, బయోఫ్యూయల్ వినియోగానికి సరికొత్త దిశను చూపిస్తోంది. సాధారణ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ల నిర్వహణకు హై-వోల్టేజ్ పవర్ గ్రిడ్లు, విస్తృత విద్యుత్ కనెక్షన్లు అవసరం ఉంటుంది. కానీ ఈ కొత్త 150ఎౌ ఫాస్ట్ ఛార్జింగ్ సిస్టమ్ ఇథనాల్‌ను ఇంధనంగా వాడుకుని అక్కడికక్కడే విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆ విద్యుత్‌తో వాహనాల బ్యాటరీలను అత్యంత వేగంగా ఛార్జ్ చేస్తుంది. దీనివల్ల భారీ పవర్ గ్రిడ్లతో లేదా విద్యుత్ లైన్లతో సంబంధం లేకుండా ఛార్జింగ్ సేవలు అందిస్తుంది. సాధారణ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల సమీకరణ, ట్రాన్స్‌మిషన్ లైన్లు, ప్రభుత్వ అనుమతులు, ట్రాన్స్‌ఫార్మర్ల అమరికకు నెలల సమయం పడుతుంది. అయితే ఈ ఇథనాల్ మొబైల్ ఛార్జింగ్ యూనిట్‌ను కేవలం 72 గంటల్లో (మూడు రోజుల్లో) ఎక్కడైనా సిద్ధం చేయవచ్చని కంపెనీ తెలిపింది. దీనివల్ల ప్రాథమిక ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఖర్చు మరియు సమయం దాదాపు 50 శాతం వరకు తగ్గుతాయి. హైవేలపై ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ వినూత్న సాంకేతికత వల్ల దేశీయ వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గొప్ప ప్రయోజనం చేకూరనుంది. ఇథనాల్‌ను చెరకు, మొక్కజొన్న, వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారు చేస్తారు కాబట్టి, దీని వినియోగం పెరిగితే రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా పంటలకు మంచి ధర దక్కుతుంది. అలాగే ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటం




తగ్గి, భారీగా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందివిద్యుత్ అందుబాటులో లేనప్పుడు వాడే డీజిల్ జనరేటర్ల కంటే ఈ ఇథనాల్ సిస్టమ్ అత్యంత పర్యావరణ అనుకూలమైనది. ఇది కార్బన్ ఉద్గారాలను దాదాపు 80 శాతం వరకు తగ్గిస్తుంది. వాహనంపై సులభంగా తరలించగల ఈ మొబైల్ ఛార్జర్, హైవేలపై అత్యవసర పరిస్థితుల్లో బ్యాటరీ ఖాళీ అయిన కార్లకు అక్కడికక్కడే ఛార్జింగ్ సేవలు అందించి ఆదుకుంటుంది. మొత్తానికి ఈ ఇథనాల్ ఛార్జింగ్ పరిజ్ఞానం గ్రీన్ మొబిలిటీ, భారతీయ వ్యవసాయ రంగాలలో ఒక విప్లవాత్మక మార్పుగా నిలవనుంది. సాధారణంగా ఫాస్ట్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ను నడపడానికి భారీ పవర్ గ్రిడ్, హై-వోల్టేజ్ విద్యుత్ కనెక్షన్ అవసరమని తెలుస్తోంది. తెలంగాణలో ప్రవేశపెట్టిన ఈ 150ఎౌ ఫాస్ట్ ఈవీ ఛార్జర్ ఈ పాత పద్ధతికి పూర్తిగా స్వస్తి పలుకుతుంది. ఈ సిస్టమ్ లోపల ఇథనాల్ నుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఒక ప్రత్యేక యంత్రం అమర్చి ఉంటుంది. ఈ యంత్రం మొదట బయోఫ్యూయల్ అంటే ఇథనాల్‌ను ఉపయోగించి అక్కడికక్కడే విద్యుత్‌ను తయారు చేస్తుంది. ఆ తర్వాత అలా ఉత్పత్తి చేసిన విద్యుత్‌తో వాహనాల బ్యాటరీలను ఛార్జ్ చేస్తుంది. అంటే ఇది వాహనానికి లభించే విద్యుత్ సోర్స్ మారుస్తుంది, దీనివల్ల గ్రిడ్ తో ఉండే సమస్య తీరుతుంది.

## జయశంకర్ సార్ వర్ధంతి-నివాళులర్పించిన కేటీఆర్



**హైదరాబాద్:**తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్లోని అయన విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా, గండ్ర వెంకటరమణ, బానోత్ శంకర్ నాయక్, కోరుకంటి చందర్, మెతుకు ఆనంద్, బిగాల గణేష్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మా రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు

## బంజారా హిల్స్ లో బేవరేజ్ బార్ ప్రారంభం

**హైదరాబాద్:**చల్లటి రుచికరమైన కోల్డ్ కాఫీ ప్రియుల కోసం మరో కొత్త కేఫ్ స్టైల్... బేవరేజ్ బార్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ బంజారాహిల్స్ మనం చాక్లెట్ ఖార్ఖానాలో బేవరేజ్ బార్ ను ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు తెలిపారు . 14 రకాల చాక్లెట్ ఫ్లేవర్స్ తో కోల్డ్ ,హాట్, షేక్స్ తయారు చేసి అందిస్తున్నట్లు తెలిపారు . మనం తాగే పానీయాన్ని మనమే డిజైన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు .

## చెరువులో బాలుడు మృతి

**సంగారెడ్డి:**తెల్లాపూర్ చెరువులో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. కుమారుడు షణ్ముక్ ను ప్లే స్కూల్ లో ఉదయం డ్రాప్ చేసి తండ్రి ఉదయ్ కిరణ్ వెళ్లాడు. తెల్లాపూర్ చెరువు పక్కనే ప్లే స్కూల్ వుంది. ప్లే స్కూల్ లో బోనాల ఉత్సవాలు జరుపుతుండగా షణ్ముక్ బయటకు వెళ్లాడు. చెరువులో పడిపోయాడు. ప్లే స్కూల్ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఆరేళ్ల షణ్ముక్ చెరువులో పడి మృతిచెందినట్లు బందవులు ఆరోపించారు. కొల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## భారత్, రష్యా బంధం బలోపేతం చేయాలి

దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ రష్యాతో సత్సంబంధాలు కొనసాగించి దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించారని మంత్రి సీతక్క అన్నారు. వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ హైదరాబాద్ కార్యాలయాన్ని మంత్రి సీతక్క సోమాజిగూడలోని హోటల్ కత్రియలో వర్చువ ల్గా ప్రారంభించారు. రష్యాకు, భారతదేశానికి ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ పనిచేయాలని సూచించారు. రష్యా, భారత్ బంధం ఇప్పటిది కాదని, నెహ్రూ, ఇందిరాగాంధీ ఉన్నప్పటి నుంచీ కొనసాగుతుందని అన్నారు. మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సంస్థకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని తెలిపారు. సంస్థ ఇండియా హెడ్ డాక్టర్ రాయల నీతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లెలో ఉద్రిక్తత

**రేపల్లె:**డీఎస్సీ స్కామ్కు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేపల్లె సెంటర్లో పీటా మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షను పోలీసులు అడ్డుకోవడంతో వైసీపీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి రేపల్లెలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వార్తాతరంగాలు



## ఏఐ-ఆధారిత సంపద అర్థ సూత్రం'ను

# ఆవిష్కరించిన మెలూహా

### వ్యక్తులు తమ ఆర్థిక సామర్థ్యాన్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికి దోహదం

**బెంగళూరు ఆగస్ట్ 6:** 190 దేశాలలో 3 మిలియన్లకు పైగా వినియోగదారులకు సేవలు అందిస్తున్న, బెంగళూరుకు చెందిన ఏఐ-కేంద్రీకృత జ్యోతిష్య వేదిక అయిన మెలూహా, లోతైన సందర్భోచిత ఆర్థిక అంతర్దృష్టులను అందించడానికి వేద జ్యోతిష్యం యొక్క శాశ్వతమైన జ్ఞానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శక్తితో మిళితం చేసే వ్యక్తిగత సంపద జ్యోతిష్య నివేదిక అయిన 'అర్థ సూత్రం'ను ఆవిష్కరించింది. భారతీయ తత్వశాస్త్రం ప్రకారం, జీవితంలోని నాలుగు ప్రాథమిక లక్ష్యాలలో ఒకటైన శ్రేయస్సు, ప్రయోజనం మరియు భౌతిక సౌభాగ్యాన్ని 'అర్థ' సూచిస్తుంది. ఈ తత్వశాస్త్రం నుండి ప్రేరణ పొంది, జ్యోతిష్యం దృష్టికోణం ద్వారా వ్యక్తులు తమ ఆర్థిక ప్రయాణాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడటానికి 'అర్థ సూత్రం' రూపొందించబడింది. ఒక వ్యక్తి యొక్క జన్మ చార్ట్, గ్రహ ప్రభావాలు, మరియు సంపద, వృత్తి, అవకాశాలు, మరియు ఆర్థిక సరళికి సంబంధించిన జ్యోతిష్య కలయికలను విశ్లేషించడం ద్వారా, ఈ నివేదిక ప్రతి వినియోగదారుని జీవిత మార్గానికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఒక వ్యక్తి యొక్క బలాలు, అవకాశాలు, మరియు జీవిత చక్రాలను అర్థం చేసుకోవడానికి జ్యోతిష్యాన్ని చాలా కాలంగా ఉపయోగిస్తున్నప్పటికీ, సంక్లిష్టమైన జన్మ చార్ట్‌లను విశ్లేషించడానికి తరచుగా గణనీయమైన నైపుణ్యం అవసరం. అర్థ సూత్రం, మెలూహా యొక్క సొంత ూా× ఇంజిన్‌ను ఉపయోగించి, ఆర్థిక ప్రయాణంపై మరింత వ్యక్తిగతీకరించిన అంతర్దృష్టులను పొందడానికి ఈ అంతరాన్ని పూరిస్తుంది, తద్వారా ఇది మరింత అందుబాటులోకి వచ్చి, సులభంగా అర్థమయ్యేలా చేస్తుంది. జ్యోతిష్యాన్ని భర్తీ చేయడానికి బదులుగా, ూా× ఒక తెలివైన సహాయకుడిగా పనిచేస్తుంది, ఇది పెద్ద ఎత్తున వ్యక్తిగతీకరించిన జ్యోతిష్య మార్గదర్శకత్వాన్ని అందించడాన్ని మెరుగుపరుస్తుంది. సంపదపై దృష్టి సారించిన జ్యోతిష్య మార్గదర్శకత్వంపై వినియోగదారుల ఆసక్తి పెరుగుతున్న తరుణంలో ఈ ప్రారంభం జరిగింది. మెలూహా ప్లాట్‌ఫారమ్‌లో, సంపదకు సంబంధించిన ప్రశ్నలు మొత్తం వినియోగదారుల ప్రశ్నలలో దాదాపు 15% ఉన్నాయి మరియు గత 12 నెలల్లో 50% పైగా పెరిగాయి. ఇది ఆర్థిక ప్రణాళిక, వృత్తిపరమైన అభివృద్ధి, మరియు దీర్ఘకాలిక శ్రేయస్సుపై వ్యక్తిగతీకరించిన అంతర్దృష్టుల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. ఎక్కువ మంది




వ్యక్తులు ముఖ్యమైన జీవిత నిర్ణయాల కోసం వ్యక్తిగత మార్గదర్శకత్వం కోరుతున్నందున, జ్యోతిష్య శాస్త్రం అనేది స్వీయ-అవగాహన మరియు ఆర్థిక శ్రేయస్సుతో సహా దీర్ఘకాలిక ప్రణాళిక కోసం ఒక సాధనంగా ఎక్కువగా పరిగణించబడుతోంది. ఈ ధోరణి ముఖ్యంగా ఉద్యోగస్తులలో స్పష్టంగా కనిపిస్తోంది. సంపద మార్గదర్శకత్వం కోరే వారిలో 65% మంది 25-44 ఏళ్ల వయస్సు వర్గానికి చెందినవారే. వీరు తమ సంపాదన మరియు సంపదను పెంచుకునే కీలక దశలో ఉండి, ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలను తీసుకోవడానికి వ్యక్తిగత మార్గదర్శకత్వం కోసం ఎక్కువగా చూస్తున్నారు. ఈ మార్పును గుర్తించి, వినియోగదారులకు వారి సంపద సామర్థ్యం, ??వృత్తిపరమైన అభివృద్ధి మరియు ఆర్థిక సరళిపై అర్థవంతమైన జ్యోతిష్య అంతర్దృష్టులను అందించడానికి మెలూహా 'అర్థ సూత్రం'ను అభివృద్ధి చేసింది. ఈ నివేదిక ఒక వ్యక్తి యొక్క వేద జన్మ చార్ట్‌ను విశ్లేషించి, సంపద యోగాలు, అనుకూలమైన ఆర్థిక కాలాలు, వృత్తి మరియు ఆదాయ సామర్థ్యంపై వ్యక్తిగత అంతర్దృష్టులను అందిస్తుంది. దీనితో పాటుగా, ప్రత్యేకమైన పరిహారాలు మరియు మార్గదర్శకత్వాన్ని కూడా అందిస్తుంది. తద్వారా, ూా× ద్వారా సంక్లిష్టమైన జ్యోతిష్య వివరణలను సరళంగా మరియు సులభంగా అందుబాటులోకి తెస్తుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా మెలూహా వ్యవస్థాపకుడు మరియు సీఈఓ అయిన విక్రమ్ లాభే మాట్లాడుతూ, "శతాబ్దాలుగా, వేద జ్యోతిష్యం ప్రజలకు వారి జీవితంలోని సంపద, వృత్తి మరియు శ్రేయస్సు వంటి వివిధ అంశాలను అర్థం చేసుకోవడంలో సహాయపడింది. ఈ సంప్రదాయంలో అత్యంత ప్రసిద్ధి చెందిన వ్యక్తులలో ఒకరు ప్రఖ్యాత జ్యోతిష్కుడు వరాహమిహిరుడు. ఈయన విక్రమాదిత్య మహారాజు ఆస్థానంలోని నవరత్నాలలో ఒకరు. పరిపాలన మరియు శ్రేయస్సుకు సంబంధించిన విషయాలపై ఈయనను సంప్రదించేవారని చెబుతారు. మెలూహాలో, సాంకేతికత ఈ శాశ్వతమైన జ్ఞానాన్ని మెరుగుపరచాలి కానీ దాని స్థానాన్ని భర్తీ చేయకూడదని మేము నమ్ముతాము. 5,000 సంవత్సరాలకు పైగా ఉన్న వేద జ్ఞానం నుండి ప్రేరణ పొంది, 'అర్థ సూత్రం' వేద జ్యోతిష్యం యొక్క లోతును ఏఐతో మిళితం చేసి, నేటి తరానికి వ్యక్తిగతీకరించిన సంపద అంతర్దృష్టులను మరింత అందుబాటులోకి మరియు సందర్భోచితంగా అందిస్తుంది. ఇది కేవలం ఒక జ్యోతిష్య నివేదిక కంటే ఎక్కువ, ఇది ఒక వ్యక్తిగతీకరించిన ఆర్థిక మార్గదర్శిగా పనిచేస్తుంది. ఇది వ్యక్తులు తమ సంపద బలాలను గుర్తించడానికి, సంభావ్య ఆదాయ అవకాశాలను వెలికితీయడానికి, ఆర్థిక సరళిని అర్థం చేసుకోవడానికి మరియు వారి సంపద ప్రయాణంలో మరింత స్పష్టతతో ముందుకు సాగడానికి సహాయపడుతుంది, అదే సమయంలో ఈ అనుభవానికి జ్యోతిష్యాన్ని కేంద్రంగా ఉంచుతుంది." అని అన్నారు. బాధ్యతాయుతమైన సాంకేతికత ద్వారా ప్రామాణికమైన జ్యోతిష్య మార్గదర్శకత్వాన్ని మరింత సులభతరం చేయాలనే మెలూహా యొక్క విస్తృత దృక్పథాన్ని అర్థ సూత్రం ప్రతిబింబిస్తుంది. నిపుణులైన జ్యోతిష్య సూత్రాలను ూా×-ఆధారిత వ్యక్తిగతీకరణతో కలపడం ద్వారా, ఈ ప్లాట్‌ఫారమ్ సంక్లిష్టమైన జ్యోతిష్య వివరణలను సులభతరం చేస్తూనే ఉంది. ఇది వినియోగదారులు జ్యోతిష్య శాస్త్రం యొక్క శాశ్వతమైన జ్ఞానానికి కట్టుబడి ఉంటూనే, జీవితంలోని వివిధ అంశాలలో మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా వీలు కల్పిస్తుందని తెలిపారు.

**మెలూహా గురించి**

మెలూహా అనేది ఒక **AI**-ఆధారిత జీవిత మార్గదర్శక ప్లాట్‌ఫారమ్. ఇది సంబంధాలు, వృత్తి, వ్యక్తిగత ఎదుగుదల మరియు సంపద వంటి అంశాలలో వ్యక్తిగతీకరించిన అంతర్దృష్టులను అందించడానికి, కృత్రిమ మేధస్సును సాంప్రదాయ జ్ఞానంతో మిళితం చేస్తుంది. 190 దేశాలలో 3 మిలియన్లకు పైగా వినియోగదారులకు సేవలు అందిస్తున్న మెలూహా, వ్యక్తులు మరింత సమాచారంతో కూడిన జీవిత నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడటానికి రూపొందించిన ూా×-ఆధారిత మార్గదర్శక పరిష్కారాలను నిర్మిస్తోంది.

# పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో వసతులు

**నిర్వాసితులందరికీ ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి కృషి**

**సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే**

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 6 (స్కై న్యూస్):** ర్యాలంపాడు, చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి పునరావాస గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో సదుపాయాలపై కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో నిర్వాసితులందరూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ర్యాలంపాడు ఆర్ అండ్ ఆర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణానికి ఇంకా 5 ఎకరాల భూమిని సేకరించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్లాట్లను మంజూరు చేస్తామన్నారు. ఆయా పునరావాస గ్రామాల్లో



అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలల భవన నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆలయాల నిర్మాణం, ఇతర పనులన్నింటినీ వేగవంతం చేసి నిర్వాసిత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వస్తుండడంతో జూరాల కుడి కాలువ పరిధిలో ఆయకట్టు రైతులు వరి సాగు చేస్తే పంట చేతికొచ్చే వరకు నీటి విడుదల విషయంలో, చివరి డిస్ట్రిబ్యూటరీతో పాటు ఆర్డీఎస్ లింక్ కాలువలకు నీళ్లు అందించే విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించడం జరిగిందని కలెక్టర్ తెలియజేశారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు స్పందిస్తూ రైతులు వరి సాగు చేయడం, పంటలు చేతికొచ్చే వరకు నీటి లభ్యత ఆధారంగా కాలువలకు నీటిని విడుదల చేసే అంశాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇతర ఇరిగేషన్ అధికారులు, సంబంధిత మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్‌కు జిల్లా పోలీసుల ఘన నివాళి

**ప్రత్యేక తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు: అదనపు ఎస్పీ కె. శంకర్**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 6(స్కై న్యూస్):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నంతా అంకితం చేసి, తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ కె. శంకర్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ఆరు దశాబ్దాల పాటు నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ గారు అని కొనియాడారు. ఆయన త్యాగం, నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజాసేవే పరమావధిగా పోలీసు శాఖ పనిచేస్తోందని, జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డి.ఎస్పీ నరేందర్ రావు, కార్యాలయ ఏ.ఓ. సాయికృష్ణ, గద్వాల సి.ఐ. టంగుటూరి శ్రీను, ఆర్.ఐలు వెంకటేష్, హరీఫ్, ఆర్.ఎస్.ఐలు, ఎస్.ఐలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తకాల పంపిణీ

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



**గద్వాల, ఆగస్టు6(స్కై న్యూస్):** ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్) గద్వాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గద్వాల శాసనసభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలు మరియు నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ... "ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, షూస్, యూనిఫామ్స్ అందిస్తోంది. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని పిలుపునిచ్చారు.

**ప్రతిభావంతులకు సన్మానం -- దివంగత విద్యార్థికి నివాళి:**

2025-26 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే గారు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఇటీవల అకాల మరణం చెందిన కళాశాల విద్యార్థి 'తరుణ్' జ్ఞాపకార్థం సభలో ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... తరుణ్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు తన తరపున ?25,000 నగదు బహుమతిగా అందిస్తానని సభాముఖంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న సార్ సభకు అధ్యక్షత వహించగా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ యం. హృదయ రాజు సార్ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కృష్ణ సార్ మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు, వార్డ్ కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసులు

**సురక్షిత డిజిటల్ వినియోగానికి ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు**



**పాపన్నపేట, ఆగస్టు 6 (వార్తతరంగాలు):** సైబర్ నేరాల పట్ల విద్యార్థుల్లో అప్రమత్తత పెంపొందించి, సురక్షిత డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించే లక్ష్యంతో గురువారం మండల కేంద్రమైన పాపన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో "సురక్షా కాతిరంగా--2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించి, ఆన్‌లైన్ మోసాల బారినపడకుండాతీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు "ూా, పాస్‌వర్డ్, ూావీ్ా×చీ, జుఎఎ వంటి గోప్యమైన బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ చెప్పబోమని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లను నమ్మబోమని, సైబర్ నేరాలపట్లఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని, కుటుంబసభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తామని" ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు. అపరిచితుల మాటలు నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకుసమాచారం పంచుకోవద్దని, ఎలాంటి అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు "సురక్షా కాతిరంగా--2026" కరపత్రాలను పంపిణీ చేసి, అందులో పొందుపరిచిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించి, తాను అప్రమత్తంగా ఉండటంతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా చైతన్యవంతులను చేయాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేష్, ఉపాధ్యాయులు నాగరాజు, ప్రవీణ్, యాదయ్య, కృష్ణకాంత్, నర్సింలు, లింగప్ప, మహిమూద్, రియాజ్, విద్యార్థిని విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు

## తెలంగాణకు దిశనిర్దేశం చేసిన

# మహానీయుడు జయశంకర్



**మక్తల్ ఆగస్టు 6( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కొనియాడారు. జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని తన నివాసంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా మళ్లీ దశ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తిగా జయశంకర్ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధనే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన జయశంకర్ సేవలు చిరస్మరణీయమని వర్గాలను ఒకే వేదిక పైకి తీసుకురావడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహా గౌడ్. టిఆర్ఎస్ నాయకులు చిన్న హనుమంతు. మహిపాల్ రెడ్డి. జుట్ట శంకర్. శివ రెడ్డి. ఎల్లారెడ్డి. కుమ్మరి రవికుమార్. ఈశ్వర్ యాదవ్. గార్లపల్లి నరసింహారెడ్డి. నేతాజీ రెడ్డి. ఎల్లిగండ్ల బాలప్ప. కర్రెమ్ అంజి. జె. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా..

**సర్పంచ్ రవితేజ**



**మక్తల్ ఆగస్టు 6( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని ఉప్పర్ పల్లి లో విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి చదువులో రాణించాలని ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ రవితేజ అన్నారు. గురువారం మక్తల్ మండల పరిధిలోని ఉప్పర్ పల్లి ప్రాథమిక పాఠశాల యందు



విద్యార్థులకు షూస్(బూట్లు ) పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను విన్నవించగా, పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని, పాఠశాల లో నెలకొన్న సమస్య లను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సురేష్, గ్రామ సెక్రెటరీ సాయినాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు నరసింహ, రేకుల కిష్టప్ప ప్రధానోపాధ్యాయులు రవీందర్ ఉపాధ్యాయులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలో పెరిగిన వరద

**ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద పెరిగింది**



**మక్తల్ ఆగస్టు 6 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద పెరిగింది. మక్తల్ మండలంలోని తాత్రేయ స్వామి పుష్కరా ఘాట్ వద్ద నెలకొల్పిన కృష్ణవేణి విగ్రహం కట్టకు అడుగు దూరం దిగువన నది ఉధృతంగా ప్రవహిస్తుంది. జూలాల ప్రాజెక్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. ఎగువ కృష్ణా నుంచి 2 లక్షల 20వేల క్యూసెక్కుల నీళ్లు చేరుతుంది. అలాగే భీమా నది నుంచి 1,లక్ష 10 వేల క్యూసెక్కుల నీరు జులార ప్రాజెక్టుకు వస్తుంది. ఇక్కడి నుంచి జూరాల కుడి ఎడమ కాలువలకు బీమా రిజర్వాయర్ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు నీటిని వినియోగిస్తుండగా 33 గేట్లను పైకెత్తి 2 లక్షల 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## మక్తల్ పట్టణంలో కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం



**ముక్తాల్ ఆగస్టు 6 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మక్తల్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస హనుమంతు గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తూ ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి గారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, నేడు మంత్రివర్యులు మక్తల్‌లో లేకపోయినా, “ఎట్టి పరిస్థితుల్లోనూ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఆగకూడదు. మీరు వెళ్లి లబ్ధిదారులకు చెక్కులు అందజేయండి” అని ఆదేశించడం తమకు ఎంతో గర్వకారణమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్ కుమార్ గారు, మాజీ జడ్పీటీసీ జి. లక్ష్మారెడ్డి గారు, ఏఎంసీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్ గారు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్టా సురేష్ గారు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

**ఎస్పీ వినీత్**



**నారాయణపేట ఆగస్టు 6: (స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరంగా బల మైన పునాది వేసి, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్ ఆశయా లు అందరికీ ఆదర్శం అని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. జయశంకర్ జయంతి సంద ర్భంగా నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయం లో ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌర వం, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం అంకితం చేశారని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆయ న అందించిన మేధోపరమై న మార్గదర్శకత్వం, నిబద్ధ త, త్యాగం చరిత్రలో చిరస్థాయిగానిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ కేవలం ఉద్యమకారుడే కాకుండా గొప్ప విద్యావేత్త, ఆలోచనాపరుడు, సమాజ సంస్కర్త అని ఎస్పీ కొని యాడారు. యువత ఆయ న నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం, విలువలను ఆదర్శంగా తీసుకుని సమా జాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశం,రాష్ట్రం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్ బి డీఎస్పీ మహేష్, ఆఫీస్ సూపర్డెంట్ శ్యామ్ సుందర్ రాజు, ఎస్సై లు పురుషో త్తం, శ్రీనివాసులు, శ్వేత, శిరీష, వివిధ విభాగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

## పరిసరాల పరిశుభ్రత పై సారథి ప్రభుత్వ కళాకారుల అవగాహన కార్యక్రమలు



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 6 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా మానవ పాడు మండలం కొరివి పాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గారి ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ అధికారి ఆరిఫ్ ఉద్దీన్ గారి ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై మరియు ఓటు అవగాహన కార్యక్రమం పై తెలంగాణ సాంస్కృతి సారధి ప్రభుత్వ కళాకారుల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రాహుల్, హాజరత్.సువర్ణ.రాధ.కేశవులు.డి.కృష్ణయ్య. శ్రీనివాసులు.కేశవులు తమ ఆట పాట మాటలతో. ప్రజలకు ఓటు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్...

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు.**



**జోగులాంబ గద్వాల,ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసి, తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశయంగా భావించి తన జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాక తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహా మేధావి అని ప్రశంసించారు. ప్రొఫెసర్ జయశంకర్ రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు తెలంగాణ ఉద్యమానికి మేధస్సుతో పాటు మార్గదర్శకత్వాన్ని కూడా అందించాయన్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం వెనుక ఉన్న జయశంకర్ విద్యారంగంలో చేసిన కృషి, సమానత్వం, ప్రాంతీయ న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన అధ్యయనాలు ఈ తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కొత్తపల్లి జయశంకర్ జీవితాంతం తెలంగాణ హక్కుల కోసం పోరాడిన మహానేతలలో ప్రముఖులుగా నిలిచిపోతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చింత రేవుల ఆలయ ఆవరణలో ఈనెల 8 నుండి 48వ చాతుర్మాస్య మహోత్సవాలు...

**ప్రతిరోజు సంపూర్ణ సేవ, సంస్థాన పూజ, అన్నదాన సేవ, తోట్టెల పూజ, పాదపూజ, తులాభారపూజ, పవమాన హోమం, నవగ్రహ హోమాలు...**

**భక్తులకు ప్రతిరోజ అన్నప్రసాద పంపిణీ....**

**ఉడిపి, పలిమరూ మఠం పీఠాధిపతులచే ప్రత్యేక ప్రవచనాలు....**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 5 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండల పరిధిలోనిపెద్ద చింతరేవుల గ్రామము నందు 18వ శతాబ్దంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానము శ్రీ వ్యాసరాయలచే ప్రతిష్ఠించబడి శ్రీ శేషదాసుల వారిచే బహిర్గతమైన శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానము నందు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు మరియు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు పలిమారు మఠం,ఉడిపి పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవములు ఈనెల ఆషాఢ బ॥దశమి తేది 08 నుండి భాద్రపద శు॥ పౌర్ణమి సెప్టెంబర్ 25 వరకు జరుగుననీ ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. ప్రతి రోజు ప్రాతఃకాలము ఉ॥ 6-00 గం.ల నుండి 7-30ని.ల వరకు శ్రీమన్న్యాయసుధా పాఠం మరియు సంస్థాన పూజ,ప్రవచన విశేష కార్యక్రమములుప్రతి రోజు ఉ॥ 10-30 ని.ల నుండి 11-30 ని.ల వరకు,సమగ్ర శ్రీ రామాయణ ప్రవచనము భాగవత ప్రవచనము పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదుల వారు మరియు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారిచే ప్రవచనాలు ఉన్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో కోరిన భక్తులకు ప్రతిరోజు పవమాన హోమం, నవగ్రహ హోమం, సంపూర్ణ సేవ, సంస్థాన పూజ,అన్నదానం, తొట్టెల పూజ,పాదపూజ, తులాభార పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా సామాగ్రి నిమిత్తం రుసుము చెల్లించాలని అన్నారు. శ్రీ పెద్ద చింతరేవుల అన్నదాన ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉదయం వేళ అల్పాహారము, టీ,కాఫీ, మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ, సాయంత్రం టీ,కాఫీ, రాత్రి సమయంలో అల్పాహారం లేదా అన్న ప్రసాద పంపిణీ భక్తులందరికీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని భక్తులు చాతుర్మాస కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలని ఆయన కోరారు. ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, తమలపాత్ర పూజలు అర్చనలు ప్రతిరోజు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు భక్తులు 9440807109, 9959251123, 9449934567, 9440770020 లలో సంప్రదించాలన్నారు.

## ప్రారంభోత్సవానికే పరిమితమైన రాజన్న బండ్ పార్క్..!

**ఏడు రోజులైనా తాళం తీయని అధికారులు**

**భక్తులకు నిరాశ, ప్రజాధనం వృథా?**

**కోట్ల రూపాయల ప్రజాధనం ఇలా వృథా కావడంపై బాధ్యత ఎవరిది?**







**వేములవాడ ఆగస్టు 6 వార్త తరంగాలు ప్రతినిధి** కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రాజన్న గుడి బండ్ పార్క్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగినా, ఆ తర్వాత మాత్రం తాళం తీసే పరిస్థితి లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రారంభించి వారం రోజులు గడిచినా సందర్శకులకు ప్రవేశం లేకపోవడంతో భక్తులు, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ. 12 కోట్లతో నిర్మాణం... కానీ ప్రజలకు అందని పార్క్ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక, పర్యాటక అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో చెరువుపై సుమారు రూ. 12 కోట్ల వ్యయంతో బండ్ పార్క్ నిర్మించారు. భారీ శివుడి విగ్రహం, సప్తమాతృకలు, పచ్చదనం, వాకింగ్ ట్రాక్‌లతో పార్క్‌ను అందంగా తీర్చిదిద్దారు. గత నెల 30న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభం జరిగింది... ప్రవేశం మాత్రం లేదు ప్రారంభోత్సవం ముగిసిన తర్వాత కూడా పార్కుకు తాళాలు వేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిర్వహణ బాధ్యత ఎవరు చేపట్టాలనే విషయంలో ఆలయ అధికారులు, ఇతర శాఖల మధ్య ఇంకా స్పష్టత లేకపోవడంతో పార్క్ ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. భక్తులకు నిరాశ... సెల్ఫీలకు వచ్చినా వెనుదిరుగుడే సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు చూసి కుటుంబాలతో, పిల్లలతో పార్క్‌ను సందర్శించేందుకు వచ్చిన భక్తులు గేటుకు తాళం చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. “ప్రారంభం చేసిన పార్క్‌ను ప్రజలకు ఎందుకు తెరవడం లేదు?” అని ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనం ఖర్చు... బాధ్యత ఎవరిది? సుమారు 700 మీటర్ల పొడవున్న ఈ పార్క్ నిర్వహణకు కనీసం 15 మంది సిబ్బంది అవసరమని అధికారులు చెబుతున్నారు. చెరువు సమీపంలో ఉండటంతో భద్రతా ఏర్పాట్లు కూడా కీలకం. అయితే నిర్వహణపై నిర్ణయం ఆలస్యం కావడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన ఆస్తి ఉపయోగం లేకుండా నిలిచిపోయింది. “ప్రారంభోత్సవం పూర్తయింది... కానీ ప్రజలకు ప్రవేశం ఎప్పుడు?” అనే ప్రశ్నకు అధికారులు వెంటనే సమాధానం చెప్పి, బండ్ పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

## వ్యసనాలకు బానిసలు కాకుండా అప్రమత్తంగా ఉండాలి...

**డ్రగ్స్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అవగాహన అవసరం.**

**సామాజిక సేవలో బ్రహ్మకుమారీల పాత్ర ప్రశంసనీయం.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 6 (స్కై న్యూస్):** మనుషుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే ఎలాంటి వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నషా ముక్త భారత్, మిషన్ స్పందన ఆధ్వర్యంలో గురువారం గద్వాలలోని బ్రహ్మకుమారిస్ పీస్ పార్క్ వద్ద ఉన్న అమృత్ కుంజ్ భవనంలో 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పిల్లలు, యువత, ఎవరైనా సరే డ్రగ్స్ మహమ్మారి భారీన పడకుండా ఇప్పటికే పోలీసు శాఖ, సంక్షేమ, తదితర శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వారికి తమ వంతుగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సహకారం అందించడం ప్రశంసనీయమన్నారు. వివిధ వ్యసనాలకు గురైన వ్యక్తులు భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతారని, ఇలాంటి వారిని తిరిగి మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు ధ్యానం తోడ్పడుతుందని, అవసరమైన చికిత్స అందజేయాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ ను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలోనూ పలు సందర్భాల్లో జిల్లాలోని విద్యాసంస్థలలోని విద్యార్థులకు వివిధ మంచి విషయాలపై కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువతలో నెగిటివిటీని పోగొట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలపై అనేక అంశాలు ఒత్తిడిని కలిగిస్తున్నాయని, సున్నిత మనస్కులపై ఇది తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉంటూ తమ పిల్లలు మంచి పౌరులుగా ఎదిగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. “వికసిత భారత్ దిశగా ఒక ముందు అడుగు” నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నషా ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ హృదయ రాజ్, డిడబ్ల్యూఓ సునంద, డా. మోహన్ రావు, డా. లక్ష్మీకాంతమ్మ, డా. మహేందర్, బ్రహ్మకుమారిస్ గద్వాల ప్రతినిధి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ సేవలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్ ప్రియాంక

**కలెక్టరేట్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు**



**నారాయణపేట ఆగస్టు 6:( స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడి న మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయ న ఆలోచనలు, రచనలు, పరిశోధనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ డీసీ రాజేందర్ గౌడ్, ఏవో అనిల్ కుమార్, బీసీ సంక్షే మ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీఆర్వో రషీద్, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు


# తల్లిపాల బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు

**నాగర్ కర్నూల్ ఆగస్టు 6( స్కై న్యూస్)** ప్రభుత్వ ఆసుపత్రులలో తల్లిపాల బ్యాంకుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ సురక్ష అని బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత బిడ్డకు అరగంటలోపు తల్లిపాలు అందించాలని దీనివల్ల ఆరోగ్యవంతమైన జీవితం ఏర్పడడంతో పాటు పౌష్టికాహారం దీన ప్రక్రియకు దూరదం చేస్తుందని అన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు సమావేశంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు డబ్బ పాలు తప్పకుండా తల్లిపాలు తాపించాలని అన్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా తల్లిపాలు తాగించాలని కోరారు మూడు రోజులపాటు వచ్చే ముర్రుపాలు శిశువుకు ప్రకృతి అందించిన తొలి టీకా ఉంటిని గుర్తించారు తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామీణ స్థాయి వరకు విస్తృతంగా తీసుకు వెళ్ళవలసిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ప్రభుత్వంపై ఉందన్నారు. తల్లిపాలు అమృతంతో సమానమని అన్నారు అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ తల్లిపాల వల్లే కలిగే ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరాలని కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ పిఎంపి ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ పుల్లారెడ్డి డాక్టర్ హరిప్రియ డాక్టర్ రోహిత్ రెడ్ క్రాస్ చైర్మన్ ఆకుతోట సాయిబాబా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కృష్ణమోహన్ డాక్టర్ రవికుమార్ జిల్లా అదనపు వైద్యాధికారి భరత్ కుమార్ సిడిపిఓ శోభారాణి తోపాటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు వైద్య కళాశాల విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు






# లయన్స్ క్లబ్ కు అవార్డుల పంట

**నాగర్ కర్నూల్ ఆగస్టు 6( స్కైన్యూస్)** లయన్స్ క్లబ్ తాజా మాజీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి పదవీకాలంలో క్లబ్ నిర్వహించిన విశిష్ట సేవలకు పలు అవార్డులను జిల్లా గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి అందించారు సందర్భంగా పలువురు మాట్లాడుతూ అందరి సహకారంతో క్లబ్ విశిష్ట సేవలు అందించడం జరిగిందని భవిష్యత్తులో కూడా నూతన కమిటీ దుస్తుతంగా సేవలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు చేయూత పర్యావరణ వారోత్సవాల నిర్వహణ సభ్యత్వ నమోదు పెంపు ఉత్తమ పరిపాలన బెస్ట్ గవర్నర్ అఫీషియల్ విజిట్ లాంటి విభాగాలలో క్లబ్ విజయం సాధించినట్లు తెలిపారు ఉత్తమ అధ్యక్ష అవార్డును నరేందర్ రెడ్డి ఉత్తమ కార్యదర్శి అవార్డును మలిపెద్ది సురేష్ కుమార్ ఉత్తమ కోశాధికారి అవార్డును పరమేశ్వర్ రెడ్డి అందుకున్నారు విశేష సేవలు అందించిన కేబినెట్ సభ్యులు హకీం విశ్వప్రసాద్ డోన్ చైర్పర్సన్ రాధారెడ్డి రాజవర్ధన్ రెడ్డి తేప్ప శ్రీను లు వ్యక్తిగత అవార్డులను అందుకున్నారు



# జయశంకర్ ఆశయాల మార్గంలో కేసీఆర్

**2028 తర్వాత మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం.. వై. రవీందర్ యాదవ్**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణ ఉద్యమ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్‌తో కలిసి పోరాడిన కేసీఆర్, అనంతరం ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేశారని షాద్‌నగర్ బీఆర్ఎస్ సీనియర్ నేత, కేశంపేట మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని షాద్‌నగర్ తిరుమల కాలనీలోని పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్, జయశంకర్ కలిసి అనేక ప్రాంతాల్లో ప్రజలను చైతన్యపరిచారని, షాద్‌నగర్ నియోజకవర్గానికి కూడా పలుమార్లు వచ్చారని గుర్తుచేశారు. జయశంకర్ సార్ తెలంగాణ సాధన ద్వారా కోరుకున్న అభివృద్ధిని కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు అందించారని పేర్కొన్నారు. 2028 తర్వాత బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, జయశంకర్ ఆశయాలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి వన్నెతెచ్చిన ఆచార్య జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, పార్టీ అధ్యక్షులు నటరాజన్, లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రాన్ని దోచిన కేసీఆర్ కాదు..
# జాతిపిత ఆచార్య జయశంకరే..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణకు జాతిపిత రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ కాదని, రాష్ట్ర సాధన కోసం నిస్వార్థంగా జీవితాంతం పోరాడిన ఆచార్య జయశంకరేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ఆచార్య జయశంకర్ విగ్రహం వద్ద షాద్‌నగర్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల కోసం నిస్వార్థంగా సేవ చేసినవారే జాతిపితలుగా నిలుస్తారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ పదవులు పొంది, కుటుంబ పాలన సాగించినవారు జాతిపితలు కాలేరని విమర్శించారు. ఆచార్య జయశంకర్ ఎలాంటి పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం చివరి శ్వాస వరకు పోరాడారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో, యువతను ఉద్యమం వైపు నడిపించడంలో ఆచార్య జయశంకర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. శ్రీకాంతాచారి వంటి ఉద్యమకారుల త్యాగాలు, ఉద్యమ తీవ్రతను గుర్తించిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారని గుర్తుచేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కంటే అవినీతికే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు, జేఏసీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, టీఎన్జీఓ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ గీతం..
# ఉద్యమానికి ప్రాణం గద్దర్

**ప్రజా యుద్ధనౌకకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన నివాళి**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 (స్కై న్యూస్):** గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన పాటలతో ఊపిరిపోసిన ప్రజా గాయకుడు గద్దర్ సేవలు అజరామరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అదేవిధంగా అయినా మాట్లాడుతూ దశాబ్దాలుగా తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన గద్దర్, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఎన్నో ప్రజా ఉద్యమాలకు తన గళంతో, పాటతో ఊపిరిపోసిన నిస్వార్థ ప్రజా నాయకుడిగా గద్దర్ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. గద్దర్ సేవలను గుర్తించిన ప్రభుత్వం సినీ కళాకారులకు అందించే పురస్కారాలకు ఆయన పేరును పెట్టడం గర్వకారణమన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన గద్దర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, జేఏసీ నేతలు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 1నాటి ధర్నాను విజయవంతం చేద్దాం

**పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి**

**నారాయణపేట ఆగస్టు 6:( స్కైన్యూస్)** ఉపాధ్యాయ సమస్యలపై సెప్టెంబర్ 1న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధన్ రెడ్డి పిలుపు నిచ్చారు. గురువా రం పిఆర్టియు టిఎస్ ధన్వాడ మండల శాఖ అధ్యక్షులు కే. కిష్టయ్య , ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మ న్న, జిల్లా కార్యదర్శి శ్రీనివా సులు ఆధ్వర్యంలో మండ లంలోని పాఠశాలలలో పిఆర్టియు టీఎస్ 2026 -2027 విద్యా సంవత్సరా నికి సభ్యత్వ నమోదు కార్యక్రమంనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ అపరి ష్కృత ఉపాధ్యాయ సమ స్యల సాధన పిఆర్టియుతో నే సాధ్యమవుతుందని అన్నారు. పలు పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశిం చి మాట్లాడుతూప్రస్తుతము రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పి.ఆర్.సి, డి ఏ లు,బిల్లులు పెండింగ్లో పెట్ట డం సగటు ఉద్యోగ ఉపా ధ్యాయులకు ఇబ్బందిక రంగా పరిణమిచ్చిందని అన్నారు.ప్రభుత్వము వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకొని 51 శాతం ఫిట్మెంట్తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవి ధంగా ప్రభుత్వము హెల్త్ కార్డ్స్ అమలులో ఉన్న సమస్యలను గురించి, కేంద్ర ప్రభుత్వము, హైకోర్టు 20 03 డీఎస్సీ ఉపాధ్యా యులకు పాత పెన్షన్ ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వము కాల యాపన చేయడం దురదృ ష్టకరమన్నారు. అదేవి ధంగా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపిఎస్ ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ అమ లుపరుస్తామని చెప్పి దాదా పు మూడు సంవత్సరాలై నా అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయు లలో అసహనం పెరిగిపో తుందని అన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభు త్వము వెంటనే సిపిఎస్ రద్దు, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలగజే యాలని అన్నారు. అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వా లని డిమాండ్ చేశారు. సంఘపక్షాన పెద్ద మొత్తం లో ఉపాధ్యాయులు పాల్గొనాలని, పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పి అర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షులు నాగార్జున రెడ్డి,సత్య నారాయణ జిల్లా ఉపాధ్య క్షులు గౌస్,నర్సింహా రెడ్డి, జిహెచ్ఎం రఘు మోహన్ , సురేష్ , రవి వర్మ గారు, రమేష్ లక్ష్మీ , చంద్రం నాయ క్ , వెంకటరాములు ,శిరీష , ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం అనురాధ, అనిత , రాధిక, చెన్నమ్మ, మానస, భారత మ్మ , భాస్కర్ రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందము పాల్గొన్నారు.




# విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి...

**ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 6 (స్కై న్యూస్)** విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు మరియు పెన్షనర్లకు రావాల్సిన పిఆర్సి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు పెండింగ్లో ఉన్న ఆరు డిజే లను బకాయిలతో సహా వెంటనే విడుదల చేయాలని కోరారు. హెల్త్ కార్డులపై వైద్యమందే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు అనంతరం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం వల్ల అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశెట్టి మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి నాయకులు సింహారెడ్డి కృష్ణయ్య వీరేశలింగం పాండు పోలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ పార్టీలతో
# ఆర్డీవో సమావేశం..



**ఓటర్ల జాబితాల పంపిణీ**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా లో షాద్‌నగర్ ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) ఎన్.ఆర్. సరిత ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబుల్ ఎలెక్టర్లకు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అలాగే ఆయా జాబితాలను రాజకీయ పార్టీల వాట్సాప్ గ్రూపుల్లో కూడా షేర్ చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)పై విస్తృతంగా చర్చించారు. కేశంపేట మండలంలో రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాదించారు. అలాగే చౌదర్‌గూడ, కొత్తూరు మండలాల్లో ఓటర్ల సంఖ్య 1,200 దాటిన నేపథ్యంలో ఒక్కో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఫరూక్‌నగర్ మండలంలో కూడా రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో నివసిస్తున్న ఓటర్ల సౌకర్యార్థం మరో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. సమావేశంలో చర్చించిన అంశాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సహకరించాలని షాద్‌నగర్ ఆర్డీవో, ఎన్నికల నమోదు అధికారి ఎన్.ఆర్. సరిత విజ్ఞప్తి చేశారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతికి ఘన నివాళులు...



**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం నిస్వార్థంగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఎలాంటి పదవులు ఆశించకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన ఆయనను తెలంగాణ జాతిపితగా గుర్తించాలని అన్నారు. యువత, విద్యార్థుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపి తెలంగాణ ఆవిర్భావానికి బలమైన పునాదులు వేసిన వ్యక్తిగా జయశంకర్ నిలిచారన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ తన పాటలతో తెలంగాణ ఉద్యమానికి విశేష ఊపునిచ్చి, వేలాది మందిని ఉద్యమ బాట పట్టించారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో జయశంకర్, గద్దర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు దొడ్డి రవికుమార్, చౌదరిగూడెం అధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, జంగారి రవి, మేకల వెంకటేష్, రవికుమార్ గౌడ్, సునీల్ రెడ్డి, అన్నారం బాలు నాయక్, గడ్డమిది రమేష్, గడ్డం జంగయ్య, యువసత్త అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, సిందం విఠలయ్యతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ప్లాప్....

## 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోంది

## రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 6 ( స్కై న్యూస్):**తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గద్వాల పట్టణంలోని ఎం ఏ ఎల్ డి డిగ్రీ కళశాల లో 'ఫీజుల బకాయి- బీజేపీ లడాయి' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల లో సుమారు 400 మంది విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. లిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువులకు ఆటంకాలు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద,మధ్య తరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొన్ని కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయడం, పరీక్షలు రాయడంలో, తదుపరి విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందడంలో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సకాలంలో విడుదల చేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్ బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయకుండా పరిమిత మొత్తాన్ని విడుదల చేయడాన్ని బీజేవైఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో గత ఆరు, ఏడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటంతో వేలాది



మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.బీజేవైఎం ప్రధాన డిమాండ్లు..పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే పూర్తిస్థాయిలో విడుదల చేయాలి.ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేయకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం అందించే భిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం గుర్తించాలి.పేద, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు ,జిల్లా ప్రధాన కార్యదర్శి లు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్,కౌన్సిలర్ శాలన్న, చంద్ర శేఖర్,జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు అనిల్,రిటైర్డ్ ఉపాధ్యాయులు పరమేశ్వర రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు అక్బర్ పాషా,అమర్ నాథ్,బిజెవైఎం నాయకులు పటేల్ పాండు,గాంజ సాయి, సతీష్,మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు..

# నామినేటెడ్ పోస్టుల్లో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలి

**షేక్ ఫారూక్ హుస్సేన్**

**నారాయణపేట ఆగస్టు 6: (స్కై న్యూస్)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ షేక్ ఫారూక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరా రు.నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డె న్స్ లో గురువారం నిర్వ హించిన ఉద్యమకారుల జిల్లా సమన్వయ సమావే శంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. ఈ సమావేశానికి సరా ఫ్ నాగరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భం గా పలువురు ఉద్యమకా రులు మాట్లాడుతూ తెలం గాణ ఉద్యమంలో పాల్గొని తమ సర్వస్వాన్ని కోల్పో యామని, కొందరు ప్రాణ త్యాగం చేశారని, వారి కుటుంబాలకు ఇప్పటికీ తగిన ఆర్థిక భరోసా అంద డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.షేక్ ఫారూక్ హుస్సే న్ మాట్లాడుతూ, ఉద్యమ కారుల వివరాలను సేకరిం చేందుకు ప్రభుత్వం ఏర్పా టు చేసిన కమిటీ కనీసం ఉమ్మడి జిల్లా కేంద్రాలను సందర్శించి ఉద్యమకారుల అభిప్రాయాలు తెలుసుకో వాలని డిమాండ్ చేశారు.అలాగే ఉద్యమకారులకు నామినేటెడ్ రాజకీయ పద వుల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ప్రతి జిల్లాలో ఐదు సింగిల్ విండో అధ్యక్ష పదవులు, కార్పొరేషన్ చైర్మన్‌లలో పది రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులను ఉద్యమకారు లకు కేటాయించాలని కోరారు.అదనంగా ఆయన ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు

**అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.**

**అమరుల భార్య లేదా భర్తకు నెలకు రూ.50 వేల పెన్షన్ మంజూరు చేయాలి.**



తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు నెలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలి.ఉద్యమకారులు కోరుకున్న గ్రామం, పట్టణం లేదా నగరంలో 250 గజాల ఇంటి స్థలం కేటాయించి, ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాం డ్ చేశారు. అనంతరం జరి గిన సమావేశంలో షరాఫ్ నాగరాజును జిల్లా కన్వీన ర్‌గా, రామ్‌రెడ్డిని కో-కన్వీ నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.నూతన జిల్లా కన్వీ నర్ సరాఫ్ నాగరాజు మాట్లాడుతూ త్వరలో కొడంగల్, మక్తల్, నారాయ ణపేట నియోజకవర్గాల ఉద్యమకారులను సమీక రించి భారీ ఆత్మీయ సమ్మే ళనం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ సమావే శంలో ఉద్యమకారులు అబ్దుల్ జహీద్, వీరన్న, కావలి గోపాల్, ఆషిరెడ్డి, కృష్ణ, వెంకట శాస్త్రి, షరీఫా బేగం, భారతి, సతీష్, లక్ష్మా రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిష్టప్ప, వేణుగోపాల్, నరసింహులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొనాయపల్లి గ్రామంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నివాళులు

**గ్రామ సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ**

**కిషన్ పేట ఆగస్టు 6:(స్కై న్యూస్)** కేశంపేట మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామంలో సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ అధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగాలు, సేవలను స్మరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ ధనలక్ష్మి రామక్రిష్ణ పేర్కొన్నారు.లిఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ హనుమంత్ నాయక్ , వార్డు సభ్యులు గ్యార సురేష్, బర్కం రామక్రిష్ణ సొప్పరి నర్సింహ, రంగు ఆంజనేయులు, డిల్లి లక్ష్మమ్మ, సొప్పరి నరేందర్, సోమరాజు మహేష్, కాకర్ల సునీల్, చిత్రమోని చెన్నయ్య, శ్రావణ్ కుమార్ మరియు తదితరులు



పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీ లు

**టౌన్ ఎస్ఐ వెంకటే శ్వర్లు**

**నారాయణపేట ఆగస్టు 6: (స్కైన్యూస్)** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లాలో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా నారాయణపేట పట్టణంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ బృందంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నిఫర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయం తో బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, రెస్టారెంట్లు అనుమానా స్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు.డ్రగ్స్, గంజా యి వంటి మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు కట్టుదిట్ట మైన చర్యలు చేపడుతు న్నారని తెలిపారు. యువ త మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ సమాజా న్ని నాశనం చేసే ప్రమాదకర మైన వ్యసనమనిఅన్నారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే



వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదాడయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చి న వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతా యని తెలిపారు.ఈ తనిఖీ ల్లో నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించిన షాద్‌నగర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఘనంగా నివాళులర్పించింది.



ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు కరుణాకర్, భరత్ లహోటి, నవీన్, సందీప్, రవి నాయక్, బాలశివారెడ్డి, సి. నర్సింలు, వెంకట్‌రెడ్డి, సురేష్ గౌడ్, సతీష్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించారు.

# నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో



కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవకు మరింత శక్తి, ధైర్యం, సంకల్పం ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలపై స్వామివారి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జ్ అందె బాబయ్య మాట్లాడుతూ, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని కొనియాడారు. షాద్‌నగర్‌తో పాటు రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి విజయం సాధించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్ గౌడ్, శ్రీనివాస్ చారి, హరీష్, రవి నాయక్, చెన్నయ్య, ప్రవీణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భావజాల వ్యాప్తికి జయశంకర్ సేవలు చిరస్మరణీయం

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ భావజాల వ్యాప్తికర్త, ప్రత్యేక రాష్ట్ర సాధన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు, ఆర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన



కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నీతా పోలే ముఖ్య అతిథిగా పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం అధ్యాపకులు జయశంకర్ జీవితం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర, విద్యారంగానికి అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# వి బి జి రామ్ జి ఉద్యోగస్తులు పెన్డౌన్, షట్ డౌన్

**చిన్న చింతకుంట ఆగస్టు 6 (స్కై న్యూస్);** తెలంగాణ రాష్ట్ర , జిల్లా మహబూబ్నగర్ జేఏసీ పిలుపుమేరకు చిన్నచింతకుంట మండల వి బి జి రామ్ జి( ఉపాధి హామీ) ఉద్యోగస్తులు, గత శు క్రవారం నుంచి పెన్డౌన్ , షట్ డౌన్ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఏపీఓ నవీన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వీరికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమ్మలు చేయాలని పెన్డౌన్ చేయడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమంలో ఏపీవో, టి ఏ లు, ఏ సి ఓ లు పాల్గొంటున్నారు.



# తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆహార్నిశలు కృషి చేసిన ఆచారి జయశంకర్

**ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి**

**చిన్న చింతకుంట, అడ్డాకుల ఆగస్టు 6 (స్కై న్యూస్);** ఆచార్య జయశంకర్ సర్ జయంతి సందర్భంగా అడ్డాకుల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు కృషి చేసిన ఆచార్య జయశంకర్ సర్ సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ట్యాంకుబ్యాండ్ పై మౌలిక వసతులు కల్పించాలి...

**నాగర్ కర్నూల్ ఆగస్టు 6( స్కై న్యూస్) జిల్లా** కేంద్రంలోని మినీ ట్యాంక్ బ్యాండ్ పై పారిశుద్ధ సమస్యను పరిష్కరించడంతోపాటు త్రాగునీటి వసతి విద్యుత్ దీపాలు మౌలిక వసతులు కల్పించేందుకు నివేదిక సమర్పించాలని మునిసిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్ సూచించారు మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం



ఆయన ట్యాంకుబ్యాండ్ ను పరిశీలించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు మునిసిపాలిటీ నిరంతరం పనిచేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి కౌన్సిలర్లు పడిగే శంకర్ నజీమా కాజా ఖాన్ అర్జునయ్య కాంగ్రెస్ నాయకులు పాండు చారి హర్షవర్ధన్ రెడ్డి ప్రవీణ్ కుమార్ జహంగీర్ శీను తదితరులు పాల్గొన్నారు

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పేట విద్యార్థుల ప్రతిభ

**మూడు బంగారు, ఒక వెండి పతకం**

**నారాయణపేట ఆగస్టు 6: (స్కైన్యూస్)** విశాఖపట్నం జిల్లా గాజు వాకలో ఆగస్టు 2న నిర్వ హించిన 4వ జాతీయ స్థాయి డ్రాగన్ షోటోఖాన్ కరాటే-డో స్పోర్ట్స్ ఛాంపి యన్‌షిప్‌లో నారాయణ పేట జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మూడు



బంగారు, ఒక వెండి పతకాలను సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టారు.పోటీల్లో అండర్-12 విభా గంలో ఆదిత్య ఫైట్ విభా గంలో బంగారు పతకం సాధించగా, అండర్-14 విభాగంలో టీ. సూర్య అన్విత్ ఫైట్ విభాగంలో బంగారు పతకం,ధనియాల్ కాటా విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నా రు. అండర్-18 విభాగంలో నరసప్ప ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించారు.ఈ జాతీయ స్థాయి పోటీ ల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక,కేరళ, తమిళనా డు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొ ని ప్రతిభ కనబర్చారు.అయితే జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నారా యణపేట జిల్లా విద్యార్థు లను గురువారం జిల్లా కలె క్టర్ సీహెచ్ ప్రియాంక అభినందించిసన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కె. అంజన్ ప్రసాద్, ఎగ్జామినర్ సి. అంబ్రేష్ మాస్టర్, టోర్న మెంట్ ఇన్‌చార్జ్ మొహమ్మ ద్ సలీం, నారాయణపేట జిల్లా ప్రెసిడెంట్ అశోక్, ఉమ్మడి మండలాల ప్రెసిడెంట్ తాయప్ప, కరాటే మాస్టర్లు అనిల్, జయశ్రీ, నవీన్, తాయ్యబ్, శివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.50 కోట్ల గంజాయి కాల్చివేత..

## ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఈఎస్ శ్రీనివాసరెడ్డి కాల్చివేత

**కొత్తగూడెం ఆగస్ట్ 6( స్కై న్యూస్):** ఖమ్మం జిల్లా కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ సేష్టన్లలో పట్టుబడిన రూ. 3.50 కోట్ల విలువ చేసే 696.1 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి అదేశాల మేరకు గురువారం కాల్చివేశారు.కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో 316.07 పేజీల గంజాయిని, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లోని 329.51 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్‌స్టేషన్‌లో 43.62 కేజీల గంజాయిని,మణుగూర్ ఎక్సైజ్ స్టేషన్ లోని 6.9 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదం పొందిన ఏ డబ్ల్యూఎస్ కన్సెటెనింగ్ గొపాల్‌పేట్ తల్లడ మండలంలోని గంజాయి కాల్చివేత పరిశ్రమలో కల్చివేశారు.నాలుగు ఎక్సైజ్ స్టేషన్లలోని 32 కేసుల్లో



పట్టుబడిన గంజాయిని దహనం చేయాలని ఖమ్మం డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఈఎస్



శ్రీనివాసరెడ్డి సీఐలు ఇతర సిబ్బంది కలిసి గంజాయిని కాల్చివేశారు.

# మెల్లగూడ తాండాల్లో హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** ఫరూక్‌నగర్ మండలంలోని మెల్లగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొంగగూడ, కాలనీ తాండాల్లో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను బుధవారం రాత్రి ప్రారంభించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా సొంత నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించడంతో స్థానికులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మెల్లగూడ సర్పంచ్ మంగారవినాయక్, ఉపసర్పంచ్ పాత్లావత్ రాజు, కౌన్సిలర్ రఘునాథ్ యాదవ్,




పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు,



గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాట్నం తిరగనంటుంది



మానవాళికి వస్త్రమై మర్యాదను అల్లిన చేతులవి...
మట్టి వాసనలో మమకారాన్ని
నేసిన మనసులవి...
దేశమనే దేహానికి స్వదేశీ అనే శ్వాసను అందించిన చేనేత రాట్నమే నేడు...
"తిరగనంటుంది..."
నేతలు రాట్నం తిప్పిన ప్రతిసారి
బానిస సంకెళ్లపై స్వేచ్ఛా శంఖం మోగేది.ప్రతి నూలు పోగులో స్వరాజ్య స్వప్నం మొలకెత్తేది. ప్రతి ఖాదీ వస్త్రంలో భారతమాత గుండె చప్పుడు వినిపించేది.
విదేశీ వస్త్రాలను వెలిగే మంటల్లో విసిరేసి, స్వదేశీ దీపాన్ని వెలిగించిన
విప్లవ జ్యోతి... ఆ చేనేత రాట్నమే కదా!
నేతన్న చెమట చుక్కలుదేశభక్తి గీతాలయ్యాయి...నూలు పోగులు జాతీయ పతాకపు రంగులయ్యాయి...
మగ్గం శబ్దమే స్వాతంత్ర్య రణభేరిగా మారింది.
కానీ నేడు...
దేశం కోసం తమ జీవితాలనే నూలుపోగులుగా అర్పించిన
ఆ చేనేత త్యాగాలను కాలమే మడతపెట్టేసిందని...
అందుకే రాట్నం తిరగనంటుంది.
ఖాదీ వస్త్రాలు తొడిగే నేతలపై నేతన్న కన్నీటి బరువు కనిపించడం లేదని... అందుకే రాట్నం తిరగనంటుంది.
జాతీయ పండుగల రోజు మాత్రమే ఖాదీని గౌరవించి, మిగిలిన రోజుల్లో నేతన్నను మరచిపోయే నకిలీ దేశభక్తిని చూసి... అందుకే రాట్నం తిరగనంటుంది.



కవి, రచయిత
కోట దామోదర్
మొబైల్ 9391480475

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్ల పంపిణీ

**ఉట్కూర్ ఆగస్టు 6 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల పరిధిలోని ముగ్గింపూర్ లో విద్యాతోనే అభివృద్ధి సాధ్యమని విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తానని మొగ్గింపూర్ గ్రామ సర్పంచ్ అన్నారు. నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండల పరిధిలోని మొగ్దుంపూర్ ప్రాథమి కొన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు బూట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రదన్నం ఇస్తూ ఉపాధ్యాయులతో పాటు బోధన నిర్వహించడంతోపాటు ఉచిత దుస్తులు మధ్యాహ్నం భోజనం పాఠ్యపుస్తకాలు ఇతర విద్యాసామాగ్రి సహా 16 రకాల వస్తువులను విద్యార్థులకు అందజేస్తుందని తెలిపారు. పాఠశాల బలోపేతానికి తమ వంతు సహకారం అందిస్తానని అక్షర సత్యతోనే సమాజా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేసి మండలంలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివరాజ్. పంచాయతీ కార్యదర్శి భాస్కర్. విద్య కమిటీ చైర్మన్ సత్యమ్మ. ఉపాధ్యాయులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘ



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్ ):** సీఐటీయూ, ఏఐకేఎస్ (రైతు సంఘం), ఏఐఏడబ్ల్యూయూ (వ్యవసాయ కార్మిక సంఘం) ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు యాచారం మండలంలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలు భరో ఉద్యమం లక్ష్యాలను వివరిస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యాచారం మండల కన్వీనర్ ఎస్. చందు నాయక్, రైతు సంఘం మండల కార్యదర్శి కే. తావు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు కే. కుమార్, నాయకులు బి. జంగయ్య, పంతు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు తరగతి గదిలో విద్యార్థి మృతి

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: టి ఆర్ ఎస్





**నారాయణపేట ఆగస్టు 6:( స్కైన్యూస్)** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠ శాలలో మూడో తరగతి విద్యార్థి పిచ్చుకుంట్ల రంజిత్ కుమార్ పాము కాటేయడంతో మృతి చెందాడు.దాంతో విద్యార్థు లు భయాందోళనకు గుర య్యారు.పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడం వాటిని తొలగించక పోవ డంతో విష పురుగులు పాఠశాలలో యదేచ్ఛగా సంచరిస్తున్నాయి.విద్యార్థి మృతితో ఆకుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.ఈ సంఘటనకు పూర్తిగా అధికారులే బాధ్యత వహిం చాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివా స్ డిమాండ్ చేశారు. పిచ్చు కుంట్ల రంజిత్ కుమార్ అనే మూడో తరగతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో పాము కాటుకు గురై మృతి చెందడం అత్యంత విషా దకరమని అన్నారు. ఇది ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని విద్యాశాఖను నిర్వహిస్తున్న సి ఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.పేద కుటుంబానికి చెందిన అమాయక బాలు డు చదువుకోవాలనే ఆశతో పాఠశాలకు వెళ్లి తిరిగి శవం గా ఇంటికి రావడం ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోం దన్నారు. పాఠశాల ప్రాంగ ణాన్ని పరిశుభ్రంగా ఉంచ కుండా, విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వహించిన అధికారులపైవెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వ సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# భూ భారతి మాడ్యూల్‌లపై పూర్తి అవగాహనతో సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, ఆగస్టు 6(స్కైన్యూస్ )**భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ (సి సి ఎల్ ఎ ) ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ఐసీ (ఎన్ ఐ సి ) కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూల్‌లపై జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి రిజిస్ట్రేషన్, సక్సెషన్ మాడ్యూల్‌లపై ప్రతి ఉద్యోగి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించిన ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా, తప్పిదాలకు తావులేకుండా నమోదు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించాలంటే ఉద్యోగుల సామర్థ్య నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. భూ భారతి వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శిక్షణలో అందించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని ,ఈ.డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్ర శేఖర్,, మాస్టర్ ట్రైనర్లు, జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# కార్పొరేట్ పాఠశాల లకు దీటుగా ప్రభుత్వ పాఠశాల లు

## కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్



**నారాయణ పేట ఆగష్టు 6: (స్కై న్యూస్)** మాగనూరు మండల కేంద్రం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు గురువారం యమ్ ఈ ఓ గణేష్ సింగ్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, స్థానిక సర్పంచ్ తనయుడు దండు సత్యనారాయణ, ఉప సర్పంచ్ పెద్దింటి రాజు, మక్తల్ మాజీ మార్కెట్ డైరెక్టర్ వాకిటి శ్రీనివా స్,స్కూల్ డ్రెస్సు, షూస్ ఉచితంగా పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు, విద్యార్థి బృందం, ఐకెపి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# చటాన్‌పల్లి బోనాల తొట్టేల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా , ఆగస్టు 6 (స్కై న్యూస్ ):** షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లిలో బుధవారం రాత్రి నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో భాగంగా సాంప్రదాయ తొట్టేల ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అశోక్ యాదవ్, అనిత రఘునాథ్ యాదవ్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, యువ నాయకులు దినేష్ సాగర్, నాని తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ RCO ను సన్మానం చేసిన జర్నలిస్టులు



**మహబూబాబాద్ ఆగస్టు 6(స్కైన్యూస్ )** జిల్లా కేంద్రంలో నూతనంగా ఆర్సిఓ బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ నాయక్ ను గురువారం జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషకరమని తాను కూడా మహబూబాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిని ఇక్కడ సేవ చేయటం చాలా సంతోషకరమని అన్నారు.. ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు తన వంతుగా న్యాయం చేస్తానని అన్నారు గురుకులాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు ఆ సమస్యకు వెంటనే పరిష్కారం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఉమ్మగాని మధు, రేఖ వర్మ , బండారి జ్ఞానేందర్ , లకావత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు

# చేవెళ్లలో ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని గురువారం చేవెళ్లలో వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సంఘం, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విశ్వకర్మ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాటి మంజుల దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 6 (స్కై న్యూస్):** షాద్‌నగర్ పట్టణంలోని ఎల్ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో లింగారెడ్డిగూడ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్ కుటుంబ సభ్యులు నిర్వహించిన కాటి మంజుల దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటి మంజుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వారు, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో నాగులపల్లి సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి, లింగారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ బీశ్వ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రూ.2,000 దాటిన యూపీఐ పేమెంట్లపై చార్జీలు..
## కొత్త చట్టంపై కసరత్తు చేస్తున్న కేంద్రం




దేశంలో ప్రస్తుతం యూపీఐ సేవల వినియోగం పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు యూపీఐ సేవలన్నీ ఉచితమే. కానీ, ఇకపై ఈ విధానంలో మార్పు వచ్చే అవకాశం ఉంది. యూపీఐ సేవలపై స్వల్ప ఫీజు వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనికోసం చట్టంలో మార్పులు తీసుకురానుంది. యూపీఐ పేమెంట్స్‌కు సంబంధించి అమలులో ఉన్న పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్‌కు పార్లమెంట్‌లో సవరణలు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ సవరణ చట్టం అమలులోకి వస్తే యూపీఐ లావాదేవీలపై పరిమితమైన ఛార్జీలు విధిస్తారు. ప్రస్తుతానికి మాత్రం ఎలాంటి ఛార్జీలు విధించడం లేదు. కొత్త చట్టం ద్వారా పేమెంట్ ఇండస్ట్రీ వర్గాల ఎప్పటినుంచో కోరుతున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలు చేస్తారు. ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం రూ.2,000 అంతకన్నా ఎక్కువ పేమెంట్స్‌పై 0.3 నుంచి 0.5 శాతం వరకు ఛార్జీ వసూలు చేస్తారు. అయితే, ఈ ఛార్జీని వినియోగదారుడు చెల్లించాల్సిన అవసరం లేదు. పేమెంట్ అందుకున్న వ్యాపారులు మాత్రమే ఈ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే, కొత్త చట్టం ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు, భారం పడదు. వ్యాపారులు మాత్రమే ఆ మొత్తం చెల్లించాలి. అది కూడా వార్షికాదాయం రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారులే. చిన్న వ్యాపారులపై దీని ప్రభావం ఉండదు. భారీ వ్యాపారం చేసే వారిపైనే భారం పడుతుంది. ఈ చట్టం ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. దీన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ దీన్ని అమలు చేయాలనుకున్నా.. ఎలా అమలుచేయాలి, దీని చట్టబద్ధత వంటి అంశాలపై పరిశీలన జరుగుతోంది. న్యాయపరమైన అంశాల్ని నిపుణులు పరిశీలిస్తున్నారు. ఆ తర్వాతే ఇది పార్లమెంట్‌లో సవరణకు వస్తుంది. అంతవరకు ప్రస్తుతం అమలవుతున్న విధానంలో ఏ మార్పూ లేదు. వినియోగదారులతోపాటు, వ్యాపారులు కూడా అదనంగా ఎలాంటి ఛార్జీలు చెల్లించనవసరం లేదు.

## సెబీకి ఎన్ఎస్ఈ రూ. 715 కోట్ల చెల్లింపు




పబ్లిక్ ఇష్యూకి వస్తున్న నేపథ్యంలో కో-–లొకేషన్, డార్క్ ఫైబర్ కేసుల వివాదాన్ని నేషనల్ స్టాక్ ఎక్ఛ్?స్చంజ్ (ఎన్ఎస్ఈ) సెటిల్ చేసుకుంది. ఇందుకోసం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి రూ. 714.74 కోట్లు చెల్లించినట్లు తెలిపింది. మొత్తం రూ. 1,491.21 కోట్లకి సెటిల్ చేసేందుకు సెబీ నుంచి సూత్రప్రాయ అనుమతులు లభించడంతో ఈ మేరకు చెల్లింపులు జరిపినట్లు వివరించింది. ఇప్పటికే రూ. 776.47 కోట్లు డిపాజిట్ చేయగా మిగతా మొత్తాన్ని తాజాగా చెల్లించినట్లు పేర్కొంది. రెండు కేసులను రూ. 1,387.39 కోట్లకు సెటిల్ చేసుకునేలా ముందుగా ప్రతిపాదించిన ఎన్ఎస్ఈ, ఆ తర్వాత దాన్ని రూ. 1,491.21 కోట్లకు సవరించింది. ఐపీవో ద్వారా ఎన్ఎస్ఈ దాదాపు రూ. 30,000 కోట్లు సమీకరించే యత్నాల్లో ఉంది.

## హమ్మయ్య ఎట్టకేలకు దిగొచ్చాయి!

# తగ్గిన కూరగాయల ధరలు

హైదరాబాద్‌లోని ప్రజలకు ఇదో ఊరటనిచ్చే వార్తనే చెప్పాలి. ఎందుకుంటే గత కొన్ని రోజుగా ముట్టుకుంటే అంటుకుంటాయోమో అనే స్థాయిలో ఉన్న కూరగాయల ధరలు ఇప్పుడు దిగొచ్చాయి. గత రెండు మూడు వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో కాపు కూడా పెరిగిన రైతు మార్కెట్‌లకు వచ్చే కూరగాయల సరఫరా కూడా పెరిగింది. దీంతో అవసరారిని సరిపడా కూరగాయలు అందుబాటులో ఉండడంతో ధరలు కూడా దిగొచ్చాయి. దీంతో హైదరాబాద్‌లోని కుకట్‌పల్లిలోని మోడరన్ అండ్ మోడల్ రైతుబజార్‌తో సహా నగర వ్యాప్తంగా ఉన్న చాలా రైతు బజార్లో కూర గాయల ధరలు ప్రజలకు ఆశించిన మేరే కనిపిస్తున్నాయి. మంగళవారం విక్రయించే రోజువారీ కూరగాయల అధికారిక ధరల జాబితాను ఎస్టేట్ ఆఫీసర్ విడుదల చేశారు. వినియోగదారులకు తాజా కూరగాయలు అందుబాటు ధరల్లో లభించేలా ఈ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ధరలను ఈ క్రింది విధంగా నిర్ణయించారు.

ప్రధాన కూరగాయలైన టమాటా కేజీ రూ. 17 ఆలుగడ్డ కేజీ రూ.19, ఉల్లిగడ్డ కేజీ రూ. 34 కి విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇక బెండకాయ:రూ.40, వంకాయ:రూ.35 , పచ్చి మిర్చి:రూ.45 , కాకరకాయ:రూ.40, బీరకాయ:రూ.38 , క్యాబేజీ:రూ.18 , క్యారెట్:రూ.41 , గోబిపువ్వు :రూ.25, దోసకాయ:రూ.18, సొరకాయ:రూ.15, పొట్లకాయ:రూ.23 గా విక్రయిస్తున్నారు.



అలాగే దొండకాయ:రూ.45 , బీన్స్:రూ.80 , చిక్కుడుకాయ:రూ.50 , గోరుచిక్కుడు:రూ.35 , బీట్ రూట్:రూ.35 , క్యాప్సికం:రూ.40 కీరా (లోకల్):రూ.23, కీరా రూ.45 విక్రయిస్తున్నారు. ఉల్లిపొరక:రూ.55 , కంద:రూ.40 । చామగడ్డ:రూ.35 । చిలగడ దుంప:రూ.35 , గుమ్మడికాయ:రూ.40 లకు అమ్ముతున్నారు.

ఇక ఇతర దినుసులు, పండ్లు, మసాలా దినుసులు ధరలు చూసుకుంటే.. పాత అల్లం కేజీ రూ.220, వెల్లుల్లి కేజీ:రూ.260 ఎండు మిర్చి:రూ.260, పండు మిర్చి:రూ.80 , చింతపండు:రూ.160 , ఆ కాకరకాయ:రూ.135, ఉసిరి:రూ.100, పల్లికాయ :రూ.70, పర్వల్:రూ.65 , లోబా:రూ.23, కరివేపాకు:రూ.50, బొప్పాయి:రూ.40, పుట్టగొడుగులు రూ. 45లకు విక్రయిస్తున్నారు.

## వరుస లాభాలకు బ్రేక్.. నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు

దేశీయ స్టాక్ మార్కెట్‌లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు రేపు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దాంతో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 210.08 పాయింట్లు నష్టపోయి 78,428.95 వద్ద స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ 159.40 పాయింట్లు క్షీణించి 24,614.90 వద్ద ముగిసింది. రోజంతా నెమ్మదిగా కదులుతూ వచ్చిన నిఫ్టీ, ఒక దశలో 24,428 కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పతనమై అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ బ్యాంక్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. అయితే బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.29 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం లాభపడింది. వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై ఆర్‌బీఐ గవర్నర్ చేయబోయే వ్యాఖ్యల కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ ప్రకటన తర్వాతే మార్కెట్ దిశ, దశ స్పష్టమవుతాయని భావిస్తున్నారు.




## గాయాలతో బుమ్రా సతమతం..

# గాబరా పడుతున్న టీమ్‌ఇండియా

జస్‌ప్రీత్ బుమ్రా.. ఈ పేసర్ బరిలోకి దిగుతున్నాడంటే ప్రత్యర్థి జట్ల బ్యాటర్ల గుండెల్లో గుబులు పుడుతుంది. స్వింగర్లు, యార్కర్లతో హడలెత్తించే పేస్ గుర్రాన్ని ఎదుర్కొవడానికి స్టార్ బ్యాటర్లు కూడా ఇబ్బందిపడతారు. ఇంతటి నాణ్యమైన బౌలర్ కీలకమైన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండట్లేదు. అందుకు కారణం అతను వరుసగా గాయాల బారినపడటం. ఈ ఏడాది ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా (దీబఎతీఖుష్త).. టీ20 ప్రపంచ కప్ ముగిశాక టీ20ల్లోనూ బరిలోకి దిగలేదు. ఐపీఎల్ తర్వాత నెలన్నరపాటు మైదానానికి దూరంగా ఉన్న అతను.. గత నెలలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌తో పునరాగమనం చేశాడు. అక్కడ రెండు మ్యాచ్‌లు ఆడి గాయం కారణంగా మూడో మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. 2016 జనవరిలో అరంగేట్రం చేసిన బుమ్రా ఇప్పటివరకు గాయం, ఫిట్‌నెస్ సమస్యలతో ఏయే మ్యాచ్‌లు, సిరీస్‌లకు దూరమయ్యాడో ఓ లుక్కేద్దాం.

2022 జులైలో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో వెన్నెముక గాయానికి గురైన జస్‌ప్రీత్ ఆ తర్వాత యూఏఈలో జరిగిన ఆసియా కప్‌నకు దూరమయ్యాడు.



ఆసియా కప్‌నకు దూరమైన బుమ్రా అదే ఏడాది సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగిన సిరీస్‌తో తిరిగి జట్టులోకి వచ్చాడు. అయితే, మళ్లీ వెన్నునొప్పి సమస్య తలెత్తడంతో 11 నెలలపాటు క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ స్టార్ పేసర్ అందుబాటులో లేని లోటు 2022 టీ20 ప్రపంచ కప్‌లో స్పష్టంగా కనిపించింది. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో 2022/23 బోర్డర్–గావస్కర్ ట్రోఫీ, తర్వాత జరిగిన ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అదే ఏడాది ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా అందుబాటులో లేడు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 209 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. 2024–25 బోర్డర్–గావస్కర్ ట్రోఫీ ఐదో టెస్టులో బౌలింగ్ చేస్తున్నప్పుడు బుమ్రా గాయపడ్డాడు. ఆ గాయం నుంచి కోలుకుంటున్న తరుణంలో 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. కానీ, నడుము కింది భాగంలో గాయమవడంతో టోర్నీకి దూరమయ్యాడు.

ఇప్పుడు మోకాలి గాయం నుంచి అతడు ఇంకా కోలుకోకపోవడంతో శ్రీలంక పర్యటనకు దూరమవుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్, ఆ తర్వాత టీ20 ప్రపంచకప్, ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లు ఉన్నాయి. కాబట్టి.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) బుమ్రా ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం, గాయాల నుంచి కోలుకునే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరముంది.

## ద్రవిడ్‌లాగే రహానేకు ఎప్పుడూ గుర్తింపు దక్కలేదు: సునీల్ గవాస్కర్


**ఇంటర్నెట్ డెస్క్:** ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు దక్కాల్సిన గుర్తింపు ఎప్పుడూ దక్కలేదని దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. "కెప్టెన్‌గా రహానేకు అద్భుతమైన రికార్డు ఉంది. అతను ఆరు టెస్టులకు సారథ్యం వహించగా.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ అద్భుతమైన విజయాలు నమోదైనప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు లభించలేదు. అలాగే రహానే (ూాయిఅఅఎిఖు తీుష్టుఅవ) నాయకత్వానికి కూడా పెద్దగా ప్రశంసలు దక్కలేదు. భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన బ్యాటర్లు లేదా బౌలర్లకే ప్రశంసలు దక్కుతాయి. కానీ జట్టు ఓడిపోయినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లే నిందలు మోయాల్సి వస్తుంది. గాయాలతో బుమ్రా సతమతం.. గాబరా పడుతున్న టీమ్‌ఇండియా



2021 ఆస్ట్రేలియా పర్యటనలో మొదటి టెస్టులో టీమ్‌ఇండియా కేవలం 36 పరుగులకే కుప్పకూలి తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. తదుపరి మ్యాచ్‌ల్లో కోచ్ రవిశాస్త్రితో కలిసి జట్టును ఆ పరిస్థితి నుంచి మెరుగైన స్థితికి చేర్చింది రహానేనే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి గెలుపుబాట పట్టించాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు అపూర్వమైన విజయాన్ని అందించడమే కాకుండా సిరీస్‌నూ సాధించిపె ట్టాడు. నిజానికి ఆ సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు అగ్రశ్రేణి ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేరు. అయినప్పటికీ భారత్ తన టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప విజయాన్ని అందుకుంది. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు" అని గవాస్కర్ పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## తొమ్మిదో సీడ్‌గా సింధు
## సాత్విక్ జోడీకి ఐదో సీడ్



**ఢిల్లీ:** సొంతగడ్డపై బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగమ్మాయి పీవీ సింధు తొమ్మిదో సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఈనెల 17 నుంచి ఢిల్లీ వేదికగా జరుగబోయే ఈ టోర్నీ కోసం మంగళవారం నిర్వహించిన డ్రాలో షట్లర్లకు సీడింగ్స్ కేటాయించారు. భారత డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి ఐదో సీడ్ దక్కగా మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్‌కు 14వ, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్–తనీష్టా 15వ సీడ్ దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ చాంప్ షి యుకీ (చైనా), విమెన్స్ సింగిల్స్‌లో అన్ సె యాంగ్ (దక్షిణ కొరియా) టాప్ సీడ్స్‌గా పోటీపడనున్నారు.

## పాక్‌కు ఆధిక్యం



ట్రినిడాడ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో పాకిస్థాన్ దీటుగా బదులిస్తోంది. రెండో రోజే మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు.. మంగళవారం అదే జోరును కొనసాగించి ఆధిక్యంలోకి వచ్చింది. ఓవర్ నైట్ స్కోరు 266/2తో ఆట కొనసాగించిన పాక్.. కడపటి వార్తలు అందే సమయానికి 381/7 స్కోరు చేసింది. రెండో రోజే శతకం బాదిన అబ్దుల్ షఫీక్ (158 బ్యాటింగ్) భారీ స్కోరు దిశగా అడుగులు వేస్తుండగా బాబర్ ఆజమ్ (88) మరోసారి సెంచరీ ముంగిట విఫలమయ్యాడు. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 344 పరుగులకు ఆలౌటైంది.

## సినిమా ఫలితాలను ముందుగా అంచనా వేయలేం.. 'కంగువ' డిజాస్టర్‌పై స్పందించిన సూర్య



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తన కెరీర్‌లో ఎదురైన బిగ్గెస్ట్ సెట్‌బ్యాక్స్ మరియు విజయాల గురించి తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. గతంలో భారీ అంచనాల మధ్య విడుదలైన 'కంగువ' సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంపై ఆయన స్పందించారు. సినిమా రంగంలో ఫలితాలను ఎప్పుడూ ముందుగా అంచనా వేయలేమని తెలిపిన సూర్య. ఇండస్ట్రీలో 30 ఏళ్ల అనుభవం ఉన్నప్పటికీ, ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉన్నానని పేర్కొన్నారు. సినిమా ఫలితాల గురించి వివరిస్తూ.. ఒక చిత్రం కోసం దాదాపు 200 రోజులకు పైగా, అర్ధ సంవత్సరం పాటు ఎంతో కష్టపడి విశ్వాసంతో పని చేసినప్పటికీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పూర్తిగా నిరాశపరిచిందని తెలిపారు. అదే సమయంలో కేవలం 45 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న మరో సినిమా ఆ సంవత్సరపు బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని అన్నారు. 'కంగువ' చిత్రం భారీ బజ్ మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద నిరాశపరచగా, ఆ తర్వాత ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన 'కరుప్పు' సినిమా సూర్య కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇదే ఇంటర్వ్యూలో లోకేష్ కనగరాజ్ సినిమా యూనివర్స్‌లోని మోస్ట్ అవేటెడ్ రోలెక్స్ పాత్ర గురించి కూడా సూర్య క్లారిటీ ఇచ్చారు. రోలెక్స్ ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై తనకు కూడా స్పష్టత లేదని, లోకేష్ ప్రస్తుతం అల్లు అర్జున్ సినిమాతో పాటు 'విక్రమ్ 2' పనులతో బిజీగా ఉన్నారని తెలిపారు. అయితే లోకేష్ మాత్రం ఇంటర్వ్యూలలో రోలెక్స్ స్క్రిప్ట్ రాస్తున్నానని చెబుతున్నారని, సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రాజెక్ట్ ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు 'ఆవేశం' దర్శకుడు జీతు మాధవన్ దర్శకత్వంలో తన హోమ్ ప్రొడక్షన్‌లో తెరకెక్కిన సినిమా షూటింగ్ నిన్ననే పూర్తయిందని, ఈ సినిమా ఈ ఏడాది చివరి నాటికి ప్రేక్షకుల ముందుకు రానుందని సూర్య అధికారికంగా ప్రకటించారు.

## 'మిర్జాపూర్' మూవీ నుంచి క్రేజీ ర్యాప్ సాంగ్.. 'దో నంబరీ' పాట విన్నారా!

ఓటీటీలో భారీ క్రేజ్ సంపాదించుకున్న పాపులర్ ఫ్రాంచైజ్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే 'మిర్జాపూర్ ది మూవీ' నుంచి మేకర్స్ ఒక క్రేజీ మాస్ ర్యాప్ సాంగ్‌ను విడుదల చేశారు. 'దో నంబరీ' పేరుతో వచ్చిన ఈ హై-వోల్టేజ్ సాంగ్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. ఈ పాటను ప్రముఖ ర్యాపర్ దండా నియోలీవాలా ఆలపించడమే కాకుండా స్వయంగా సాహిత్యాన్ని అందించి, స్వరపరిచారు. 'బందే నంబర్ 1 కే.. ధంధే దో నంబరీ' అంటూ సాగే లిరిక్స్, ఊరమాస్ బీట్స్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4, 2026 న థియేటర్లలో భారీ ఎత్తున విడుదల కానుంది. మరోవైపు అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'మిర్జాపూర్ ది మూవీ' ఆఫీషియల్ ట్రైలర్ ఈ నెల ఆగస్టు 11న విడుదల కానుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్, అమెజాన్ ఎంజిఎమ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాను అభినయ్ పండిట్ సినిమాటోగ్రఫీతో, మెహ్రాన్ ఎడిటింగ్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కిస్తున్నారు.



## గచ్చిబౌలిలో చార్మినార్ సెటప్.. ప్రభాస్ ఫౌజీ షూటింగ్‌కు సాలిడ్ ప్లాన్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి--లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటీవల సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో పలు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వాటికి నిర్మాతలు ఇప్పటికే చెక్ పెట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.



## ఎప్పటికైనా ఆ తెలుగు స్టార్ హీరో సినిమాలో నటించాలన్నది నా కోరిక.. మనసులో మాట బయటపెట్టిన లయ

సీనియర్ హీరోయిన్ లయ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సావిత్రి, సౌందర్య తర్వాత తెలుగులో హోమ్లీ హీరోయిన్ గా లయ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా తెలుగులో ఫ్యామిలీ ఓరియంటెడ్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయింది లయ. తనదైన అందం, సహజ నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకుందీ అందాల తార. అయితే పెళ్లి తర్వాత క్రమంగా సినిమాలకు దూరమైంది లయ. భర్తతో కలిసి విదేశాల్లో సెటిలైపోయింది. అయితే ఇప్పుడు పిల్లలు పెరిగి పెద్ద వారవ్వడంతో మళ్లీ సినిమా ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇచ్చిందీ ముద్దుగుమ్మ. గతేడాది నితిన్ హీరోగా నటించిన తమ్ముడు సినిమాతో సెకెండ్ ఇన్నింగ్స్ షురూ చేసింది లయ. ఇక ఈ ఏడాది శివాజీతో కలిసి సాంప్రదాయనీ సుప్పిని శుద్ధపూసని అనే సినిమాలో లీడ్ రోల్ చేసింది. రీసెంట్ గా జగపతిబాబుతో కలిసి వదలా, అలాగే శ్రీకాంత్ తో కలిసి మిస్టర్ మిడిల్ క్లాస్ అనే సినిమాల్లో లీడ్ హీరోయిన్ గా చేసింది. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ లో లయకు కలిసి రావడం లేదు. ఇప్పటివరకు ఆమె చేసిన నాలుగు సినిమాలన్నీ కమర్షియల్ గా విజయం సాధించలేకపోయాయి. దీంతో రీఎంట్రీలో సాలిడ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తోందీ అందాల తార.

ఇదిలా ఉంటే తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరితోనూ కలిసి నటించింది లయ. బాలకృష్ణ వంటి సీనియర్ హీరోలతోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. అయితే ఆమెకు మాత్రం మెగాస్టార్ చిరంజీవి సినిమాలో చేయాలన్న కల కలగానే మిగిలిపోయిందట. ఇదే విషయంపై ఇక ఇంటర్వ్యూలో మాట్లాడిన లయ.. 'ఒక్కొక్కరు ఒక్కో స్టేజ్ నుంచి వస్తారు. హీరోయిన్‌గా రాణిస్తారు. స్టార్‌గా ఎదుగుతారు. సక్సెస్‌ని బట్టి వారి రేంజ్ పెరుగుతూ ఉంటుంది. నేను కూడా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాను. ఒక స్టేజ్‌కి వచ్చాక మరో స్టేజ్‌కి వెళ్లాలనుకుంటాం. నా సినిమా కెరీర్ లో చాలా మంది హీరోలతో నటించాను. కానీ మెగాస్టార్ చిరంజీవితో కలిసి వర్క్ చేసే అవకాశం రాలేదు. ఆయనతో సినిమా చేయాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉంది. కానీ ఇప్పటివరకు ఆ కోరిక తీరలేదు. చిరంజీవితో సినిమా చేయలేకపోయాననే వెలితి అలానే ఉండిపోయింది. ఆ అసంతృప్తి ఇప్పటికీ ఫీలవుతుంటాను. కనీసం సెకెండ్ ఇన్నింగ్స్ లోనైనా ఆయనతో సినిమా చేసే అవకాశం వస్తే బాగుండు' అని చెప్పుకొచ్చారు లయ. ప్రస్తుతం ఈ సీనియర్ నటి కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. మరి మెగాస్టార్ తో నటించే ఛాన్స్ లయకు ఎప్పుడు వస్తుందో చూడాలి.

# ఆషాఢ బోనాల సందడిలో దేవాలయాలు....

## అమ్మవార్ల ఆశీస్సులు పొందిన భక్తులు



**సంగారెడ్డి ఆగస్టు 6 (స్నైన్యూస్ ):** ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గంలోని ఇస్మాయిల్ ఖాన్ పెట్ గ్రామంలో అమ్మవారి దేవాలయాలు బోనాల ఉత్సవాలతో భక్తుల రద్దీతో కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలందరూ బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం, ఎల్లమ్మ ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, బంగారు మైసమ్మ ఆలయం, పోచమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జెడ్పిటిసి మనోహర్గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ గోనెల రఘు, ఆషాఢ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి కటాక్షంతో రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే సంగారెడ్డి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మనోహర్ గౌడ్, మాజీ సర్పంచ్ రఘు, గ్రామ బిఆర్ఎస్ నాయకులు కృష్ణమూర్తి, జంగిలి శంకర్, శ్రీనివాస్ గౌడ్, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు.

# నిరసనల వేళ పోలీసులు సంయమనం పాటించాలి



జులై 20న జరిగిన 'మార్చ్ టు పార్లమెంట్' ఆందోళనల సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించడం సరికాదని పేర్కొంది. పార్లమెంట్ వైపు దూసుకొచ్చిన వారిపై పోలీసులు తగిన జవాబుదారీతనం ప్రదర్శించలేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎలా అదుపు చేయాలో పోలీసులకే బాగా తెలుసన్న ధర్మాసనం, శాంతియుత నిరసనలను ప్రోత్సహించాలని, పరిస్థితి చేయిదాటకుండా చూడాలని పేర్కొంది. ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుందన్న ధర్మాసనం, నిరసనకారుల సమస్యలను విని శాంతియుత మార్గాలను ప్రోత్సహించాలని సూచించింది. ఇదే అంశంపై నిర్వాహకులపై చర్యలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన పిటిషన్‌తో ధర్మాసనం జత చేసింది.

"శాంతియుత ర్యాలీని ప్రోత్సహించడం ముఖ్యం. ఆందోళనల వేళ పోలీసులు, భద్రతా బలగాలు సంయమనం పాటించాలి. రాళ్లు విసిరిన యువతపై కఠినంగా వ్యవహరించవద్దు. యువత హింసకు పాల్పడకుండా ఉండేలా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. కౌన్సెలింగ్ ఇచ్చి శాంతింపజేయడమే ప్రభుత్వాల బాధ్యత. నిరసనకారుల సమస్యను వినడమే బలమైన ఆయుధం. ప్రభుత్వం వైపు నుంచి దూకుడు ప్రదర్శిస్తే సామాజికంగా హింస మరింత పెరుగుతుంది. దారితప్పిన మూకలు రాళ్లు రువ్వినా యువతను శాంతింపజేయడానికే చూడాలి. యువతకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. యువత నిరసనలకు కారణాలను వినడమే అత్యంత శక్తిమంతమైన సాధనం. ప్రభుత్వం నుంచి వచ్చే తీవ్ర ప్రతిస్పందన సమాజంలో మంటలను మరింత పెంచుతుంది. వారి మాటలు వినండి, వారు ఎందుకు నినాదాలు చేస్తున్నారో అర్థం చేసుకోండి. అయితే, ఈ విషయాన్ని చట్టాన్ని అమలు చేసే సంస్థల విచక్షణకే వదిలేద్దాం. ఇలాంటి పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో వారికి మనకంటే బాగా తెలుసు."

అంతకుముందు నిర్వాహకులపై చర్యలు కోరుతూ మనీష్ కుమార్ సోలంకి దాఖలు చేసిన పిటిషన్?పై ఆయన తరఫున న్యాయవాది రిజ్వాన్ అహ్మద్ హాజరై వాదించారు. "15 రోజులు గడిచిపోయాయి. మరి నిర్వాహకుల జవాబుదారీతనం సంగతేంటి? వారు ఒక ఛానల్ నుంచి మరో ఛానల్‌కు వెళ్తూ రెచ్చగొట్టే ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ఉద్రిక్తతలను చల్లార్చడానికి నిరాకరిస్తున్నారు. నిన్న రాజస్థాన్‌లో రాళ్ల దాడి జరిగింది. ఇది చాలా ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుంది. రాజస్థాన్?లో జరిగిన నిరసనల్లో ఒక యువకుడు మరణించాడు. జాతీయ రాజధానికి సంబంధించిన విషయంలో ప్రభుత్వం అతిగా వెనక్కి తగ్గితే, అది రాజస్థాన్‌లో ఒక ఉదాహరణగా నిలవదా? అక్కడ కూడా విద్యార్థులకు అనుకూలంగా ప్రభుత్వం వెనక్కి తగ్గుతోంది. లఖ్?నవూలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏదైనా డిమాండ్‌తో బస్సులపై రాళ్లు రువ్వడం ప్రారంభిస్తే, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గుతుందా?" అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తప్పుడు వైఖరి అనుసరించిందన్న ఏకైక కారణంతో, రాళ్లు రువ్విన వారిని ఎలాంటి పరిశీలన లేకుండా శిక్ష నుంచి తప్పించకూడదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. "ఇది చాలా ప్రమాదకరమైన ఆనవాయితీ. మూడేళ్ల క్రితం రైతులు సింఘూ సరిహద్దు వద్ద ఇలానే చేశారు. రేపు ఆల్ఫా, బీటా, గామా, డెల్టా తరాల వారు వస్తారు. సింఘూ సరిహద్దులోని ప్రజలు ట్రాక్టర్లతో పార్లమెంటుకు వస్తారు. అక్కడ అనుమతి లేదు, పైగా నిర్వాహకులు 22 షరతులను ఉల్లంఘించారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు వైపు నిరసనకారులు ర్యాలీగా వెళ్లడం సరికాదు. ఒకవేళ 500 మంది పార్లమెంటులోకి ప్రవేశించి ఉంటే, వారి వద్ద నాటు తుపాకులు లేదా నాటు బాంబులు లేవని ఎవరికి తెలుసు? ఒకవేళ వారు కాల్పులు జరిపి ఉంటే పరిస్థితి ఏమయ్యేది? వారు జాతీయ రహదారిపై, రైల్వే లైన్?పై ర్యాలీ చేయలేదు. వారు ప్రజాస్వామ్య దేవాలయం వైపు ర్యాలీగా వెళ్లారు. దీనికి అందరూ బాధ్యత వహించాలి." అని న్యాయవాది అన్నారు. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 'సంసద్ మార్చ్'ను చేపట్టింది. మార్చ్ సందర్భంగా రాళ్ల దాడి ఘటనలు జరగడంతో పోలీసులు ప్రతిచర్యలకు దిగారు. ఈ క్రమంలోనే పలువురు నిరసనకారులు, భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగమే



జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీని దోపిడీ దినోత్సవంగా పాటించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాన్ని? భారత్? తీవ్రంగా ఖండించింది. ఇది ముమ్మాటికి భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్? చేస్తున్న దుష్ప్రచారమేనని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ప్రయత్నాలతో అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని పాక్? యత్నిస్తోందని మండిపడింది. అయితే, భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ సూచించారు. అలాగే పాక్? భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, ఆక్రమణలో ఉన్న భారత భూభాగాలన్నింటినీ తక్షణమే ఖాళీ చేయాలని వ్యాఖ్యానించారు.

మీడియాతో బుధవారం మాట్లాడిన జైస్వాల్, పాకిస్థాన్?కు చురకలంటించారు. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్? కేంద్ర పాలిత ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని ఉద్ఘాటించారు. గతంలోనూ అవి భారత్‌లో భాగమేనని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతాయని నొక్కి చెప్పారు. భారత ప్రభుత్వం 2019 ఆగస్టు 5న, జమ్మూకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను రద్దు చేసి, ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 5ను 'యౌమ్-ఎ-ఇస్తేహ్సాల్'గా పాకిస్థాన్ పాటిస్తూ వస్తోంది. అలాగే, ఏడేళ్ల క్రితం దిల్లీ తీసుకున్న చర్య దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వాలను నెలకొల్పే ప్రయత్నాలను క్లిష్టతరం చేసిందని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యాఖ్యానించారు. అందుకు బదులుగా రణ్‌ధీర్ జైస్వాల్ ఘాటుగా స్పందిస్తూ, పాక్? చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, వాటిని భారత్ పూర్తిగా తిరస్కరిస్తోందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన 2019లో చేసిన రాజ్యాంగపరమైన మార్పులు పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో వ్యాఖ్యానించే అర్హత పాక్?కు లేదని గట్టిగా చెప్పారు. అయితే భారత ప్రభుత్వ నిర్ణయాల వల్ల అక్కడ ప్రజలకు గతంతో పోలిస్తే మెరుగైన పరిపాలన, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని, సుపరిపాలనను, ప్రజాస్వామ్య సాధికారతను అందించాయని తెలిపారు.

ప్రజలపై పాక్ అణచివేత

పాకిస్థాన్ తన దేశంలోని 'ప్రస్తుత పరిస్థితిని, మానవ హక్కుల రికార్డును, ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా తనకున్న స్థితి' నుంచి ప్రపంచం దృష్టిని మళ్లించేందుకు భారత్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తోందని రణ్?ధీర్? జైస్వాల్? పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఇటీవల నిరసనకారులపై పాకిస్థాన్ జరిపిన చర్యను ఆయన ప్రస్తావించారు. పీఓకేలో శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై పాక్? బలగాలు తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. నిరసనకారులను అణిచివేయడానికి వారిపై కాల్పులు జరపడం, కఠిన ఆంక్షలు విధించడం వంటి చర్యలు అక్కడి వాస్తవ పరిస్థితిని అంతర్జాతీయ సమాజం చూస్తోందని తెలిపారు.

కాగా, జూన్ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలపై పాక్? దళాలు జరిపిన అణచివేతలో కనీసం 90 మంది ప్రాణాలు కోల్పోయారని, సాధారణ పౌరులపై ప్రభుత్వ బలగాలు హింసకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని జైస్వాల్? పేర్కొన్నారు. అంతకుముందు కూడా పీఓకే పౌరులపై పాక్ ప్రభుత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని భారత్ మండిపడింది. అంతర్జాతీయ సమాజం దీన్ని గమనించి పాక్‌ను జవాబుదారీ చేయాలని పిలుపునిచ్చింది. పీవోకేలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జులై 27 నుంచి జరుగుతున్న సైన్యం దాడుల్లో 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఇటీవల దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రణధీర్ జైస్వాల్? పేర్కొన్నారు. పీవోకేలోని ప్రజలను పాక్ రక్షణశాఖ మంత్రి శత్రువులుగా అభివర్ణించారని, ఆ తర్వాతే వారిపై సైన్యం దాడుల్ని తీవ్రం చేసిందని వ్యాఖ్యానించారు.

## యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడు

కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. నిరసన చేస్తున్న యువతపై జరిగిన హింసకు అమిత్ షానే బాధ్యుడని దుయ్యబట్టారు. విద్యార్థులకు సంబంధించి ఏం జరిగిందో పార్లమెంటులో వివరించే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. పేపర్ లీకేజీల సమస్యపై నిరసన తెలిపిన విద్యార్థులను కలిసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కోసం పోరాడి, భారతదేశ భావనను పరిరక్షించిన వేలాది మంది విద్యార్థులను చూసి గర్వంగా ఉందన్నారు. తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలపడంలో ఎలాంటి తప్పులేదని, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం నేరం కాదన్న రాహుల్, దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు.

"యువ నిరసనకారులతో మేము స్వేచ్ఛగా మాట్లాడాం. తమపై దాడి చేశారని, కొట్టారని, బెదిరించారని వారు నాతో చెప్పారు. నాకు వారిని చూసి చాలా గర్వంగా ఉంది. వారు చేసిన పనికి, అలాగే వారిలాగే వేలాది మంది యువ భారతీయులు చేసిన పనికి నేను చాలా గర్విస్తున్నాను. వారు రాజ్యాంగాన్ని కాపాడారు, 'భారతదేశం' అనే భావనను రక్షించారు, భారతదేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలే స్థితిలో, నిరుపయోగంగా ఉన్న విద్యావ్యవస్థపై ఫిర్యాదు చేయడం ఏమాత్రం నేరం కాదు. ఒకవేళ ఏమైనా చేయాల్సి ఉంటే, ఆ వ్యవస్థను మార్చాలి, సరిదిద్దాలి. వారు కోరింది కూడా సరిగ్గా అదే. వారు ఎలాంటి హింసకూ పాల్పడలేదు, దూకుడుగా ప్రవర్తించలేదు, అసభ్యంగా నడుచుకోలేదు. కానీ వారిపై దాడి చేశారు, కొట్టారు, బెదిరించారు. మహిళల ఇళ్లకు గుండాలను పంపడం, 15 ఏళ్ల చిన్నారిని బలవంతం చేసి క్షమాపణలు చెప్పించడం, ఆపై ఆ క్షమాపణను అంగీకరించడం పక్కా మూర్ఖత్వం. దాన్ని మేము అంగీకరించం. సరిగ్గా పనిచేసే విద్యావ్యవస్థ మాకు కావాలి. ప్రశ్నాపత్రాల లీకేజీలు ఆగాలి. ఈ దేశ భవిష్యత్తు అయిన ఈ యువతను గౌరవించాలి, రక్షించాలి. మీ అందరినీ చూసి నేను ఎంతగానో గర్విస్తున్నాను. ఈ పని చేసిన ప్రతి ఒక్క యువకుడిని చూసి గర్విస్తున్నాను. మీరు ఎలాంటి తప్పూ చేయలేదు. ఇక మీరు క్షమాపణ చెప్పాలనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. మీరు ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదు, ఎందుకంటే మీరు ఏ తప్పూ చేయలేదు."

"యువతిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. కొన్ని రోజుల క్రితం నేను మీడియా ముందు ఉంచిన యువకుడిపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపిన వ్యక్తి. అలాగే ఈ యువతికి వ్యతిరేకంగా పోలీసు యంత్రాంగాన్ని ఉసిగొల్పిన వ్యక్తి అమిత్ షానే. ఆయనే భారతదేశ హోం మంత్రి. ఆయన (షా) పార్లమెంటుకు రావాల్సిన కనీస మర్యాద కూడా పాటించడం లేదు. జరిగిన ఘటనపై స్పందించే కనీస మర్యాద, ధైర్యం ఆయనకు లేవు. ఇందులో రెండు అవకాశాలు ఉన్నాయి: ఒకటి, పిల్లలపై హింస జరిగిందన్న విషయం ఆయనకు తెలియకపోవచ్చు. అలా అయితే ఆయన అసమర్థుడు అనుకోవాలి. రెండోది యువతపై పెల్లెట్ గన్ కాల్పులు జరపాలని, హింసను ప్రేరేపించాలని ఆయనే ఆదేశించి ఉండవచ్చు. అలా అయితే ఆయన బాధ్యుడు (నేరస్థుడు) అవుతారు. ఏది ఏమైనప్పటికీ, దీనికి ఆయనే బాధ్యుడు." అని రాహుల్ గాంధీ అన్నారు. సమర్థంగా పనిచేసే విద్యా వ్యవస్థ ఉండాలని, పరీక్షా పత్రాల లీకేజీలు ఆగిపోవాలని, అలాగే భవిష్యత్తును గౌరవించి కాపాడాలని గాంధీ పిలుపునిచ్చారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లేవ్






పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారంటూ వస్తున్న వార్తలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై (నియోజకవర్గాల పునర్విభజన) చర్చించేందుకు ఆగస్ట్ 16- 18 తేదీల్లో స్పెషల్ సెషన్ నిర్వహించానున్నారనే ప్రచారాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని ఆయన బుధవారం రాత్రి స్పష్టం చేశారు. అదే విధంగా ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను పొడిగించే అవకాశాలు కూడా లేవని రిజిజు వెల్లడించారు. ప్రస్తుత పార్లమెంట్ మాన్సూన్ సెషన్ జులై 20 నుంచి ఆగస్ట్ 13 వరకు కొనసాగనుంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఆగస్ట్ 13నే ఇవి ముగియనున్నాయని రిజిజు వెల్లడించారు. ఈ సమావేశాల్లో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లును, అలాగే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రిజిజు దీనిపై క్లారిటీ ఇచ్చారు.

## ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి



**మహబూబ్‌నగర్ ఆగస్టు 6(స్నైన్యూస్ )** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి తో కలసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో టెంట్ల ఏర్పాటు, వీఐపీ సీటింగ్, ప్రధాన వేదిక ఏర్పాటు, అధికారులు, ప్రజాప్రతినిధుల సీటింగ్ ఏర్పాటు, పరేడ్ నిర్వహణ విధానం, కార్యక్రమాల ప్రారంభ క్రమం, శకటాల ప్రదర్శన, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, అవసరమైన చోట మార్పులు చేసి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్షం కురిసే అవకాశం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో ఆర్‌డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137